https://epaper.andhramanam.com/

ఆంధ్ర మనం

తెలుగు దినపత్రిక


తిరుపతి- మంగళవారం 23 జూన్ 2026 | సంపుటి : 01 | సంచిక : 321 | పేజీలు : 8 | వెల రూ.5

PUBLISHED FROM TIRUPATI | AMARAVATHI | RAJAHMUNDRY | VISAKHAPATNAM | KURNOOL | ANANTAPUR | KADAPA | HYDERABAD |

## సింధుజలాలపై అవసరమైతే యుద్ధం

భారత్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం

పాక్ రక్షణ మంత్రి ఖవాజా ప్రేలాపనలు



04



## అమెరికాకు షాకిచ్చిన చైనా

పలు రక్షణ కంపెనీలపై ఆంక్షలు

04

# కుట్రలతో ప్రభుత్వంపై దుష్ప్రచారం

### రాజకీయం రంగు పులుముతున్న నేతలు

**ఫేక్ ప్రచారాలపై ఉద్యోగులు అప్రమత్తం కావాలి**


**ప్రజల సమస్యల పరిష్కారంలో మానవీయకోణం ముఖ్యం**

**ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు హెచ్చరిక**

రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయని.. ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. వివిధ ఘటనలకు కులమతాల రంగు పులుముతున్నారని.. వాటిని వివాదాస్పద అంశాలుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీజీఎస్‌పై సమీక్షలో భాగంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులు, అధికారులను బద్నాం చేస్తున్నారన్నారు.

అమరావతి, జూన్ 22, ఆంధ్ర మనం: ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. మానవీయ కోణంలో పీజీఆరఎస్ అర్జీలను పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంతమంది నేరాలకు పాల్పడు తున్నారని చంద్రబాబు అన్నారు. డ్రగ్స్, గంజా యిలకు అలవాటు పడి తప్పుదారి పడుతున్నా రని వ్యాఖ్యానించారు. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటు న్నారని, శిక్షలు కూడా పడుతున్నాయని చెప్పారు. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసర ముందన్నారు. తప్పు చేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడని హెచ్చరించారు. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంచ్ చేసేలోపు క్వాంటం పార్కు, సెవి కండక్టర్ల

-మిగతా 2 లో..



## స్వర్ణాంధ్ర లక్ష్యాలపై ఎంఓయూ

02

ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్‌తో ఒప్పందం

15 శాతం వృద్ధిరేటు లక్ష్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు



# జగన్ 2.0తో మారనున్న వ్యూహం?

### కార్యకర్తల వైపు వైసీపీ చూపు

### వాలంటీర్ మోడల్‌కు గుడ్‌బై?

### క్యాడర్‌ను మళ్లీ నమ్ముకుంటున్న జగన్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొత్త రాజకీయ చర్చకు తెరలేచింది. గత ఎన్నికల పరాజయం తర్వాత పార్టీ పునర్నిర్మాణంపై దృష్టి పెట్టిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఇటీవల నిర్వహిస్తున్న నియోజకవర్గ సమీక్షల్లో "జగన్ 2.0" అనే కొత్త నినాదాన్ని ముందుకు తీసుకొస్తున్నారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యకర్తలకే ప్రాధాన్యత ఉంటుందని, సంక్షేమ కార్యక్రమాలు సైతం క్షేత్రస్థాయి నాయకత్వం ద్వారానే ప్రజలకు చేరుతాయని చెబుతున్నారు.

**తాడేపల్లి, జూన్ 22(ఆంధ్ర మనం):** ప్రతిపక్ష దశలో పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశించిన స్థాయిలో గుర్తింపు పొందలేదనే భావన వైసీపీ శ్రేణుల్లో బలంగా ఏర్పడింది. గ్రామ, వార్డు స్థాయిలో పార్టీ నాయకుల పాత్ర క్రమంగా తగ్గిపోవడంతో అనేక ప్రాంతాల్లో క్యాడ ర్‌లో అసంతృప్తి పెరిగింది. ప్రభుత్వ యంత్రాంగం, వాలంటీర్ వ్యవస్థ ప్రజలకు సేవలు అందించినప్పటికీ, పార్టీ కార్యకర్తలకు రాజకీయంగా లభించాల్సిన గుర్తింపు తగ్గిందనే అభిప్రాయం వ్యక్తమైంది.

-మిగతా 2 లో..

## తుంగభద్ర గేట్ల ప్రారంభోత్సవానికి సీఎంకు ఆహ్వానం



అమరావతి, జూన్ 22 ఆంధ్ర మనం: ఈ నెల 25న నిర్వహించనున్న తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ కర్నాటక రాష్ట్ర మాజీ మంత్రి ఎన్.ఎస్. బోసురాజు, ఎమ్మెల్యే బసవరాజు, ఎమ్మెల్సీ బసవన్న గౌడ సోమవారం ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడును సచివాలయంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా తుంగభద్ర ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను సీఎంకు వివరించిన వారు, కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఆహ్వానాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి వారితో కొద్దిసేపు మర్యాదపూర్వకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల మధ్య జల వనరుల వినియోగం, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా అభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిసింది. సమావేశం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.



## సాయికృష్ణ కేసులో విజయవాడ సీపీని సస్పెండ్ చేయాల్సిందే

### మాజీ మంత్రి అంబటి రాంబాబు

తాడేపల్లి, జూన్ 22 ఆంధ్ర మనం : విజయవాడ పోలీసుల చేతిలో చనిపోయిన గాదె సాయికృష్ణ కేసులో వాస్తవాలు బయటికి రావాలంటే పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబును సస్పెండ్ చేయాలని, ఈ కేసును సీబీఐకి అప్పగించాలని వైయస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు

-మిగతా 2 లో..

# 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీ

**ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా కృషి**

**ఏపీ రూపురేఖలు మార్చేలా చంద్రబాబు వేగంగా అడుగులు**

**ఢిల్లీ సదస్సులో మంత్రి లోకేశ్ వెల్లడి**



**న్యూఢిల్లీ, జూన్ 22, ఆంధ్ర మనం:** 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రధాన విజన్ అని లోకేష్ వెల్లడించా రు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగా ల సృష్టే ధ్యేయంగా ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని చెప్పారు. ఢిల్లీ వేదికగా జరిగిన 'రిపబ్లిక్ టీవీ సమిట్ 2026'లో ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొని రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర రూపురేఖ లను మార్చేందుకు అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీ ఫార్ములాను అందిస్తోందని పేర్కొన్నారు. మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యం త వేగంగా పనులు పూర్తి కావాలని కోరుకునే ఒక 'స్పీడ్ బాస్'. ఆయన వేగానికి తగ్గట్టుగానే యంత్రాంగం పనిచేస్తోం ది. ప్రస్తుతం దేశంలోకి వస్తున్న

-మిగతా 2 లో..

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన

**నాంపల్లి కోర్టుకు హాజరుకాని అల్లు అర్జున్**

**షూటింగ్‌ల కారణంగా రాలేకపోయారని వివరణ**

**విచారణ జూలై 6కు వాయిదా వేసిన కోర్టు**

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసుపై నాంపల్లి కోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న పలువురు కోర్టు ముందు హాజరుకాగా, సినీ నటుడు అల్లు అర్జున్ వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేకపోయారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.



04



02

## పలు జిల్లాలకు వర్ష హెచ్చరిక

అప్రమత్తం చేసిన విపత్తు నిర్వహణ శాఖ

# లక్నోలో భారీ అగ్నిప్రమాదం

**కోచింగ్ సెంటర్‌లో మంటలు..15మంది దుర్మరణం**

**తక్షణమే చర్యలకు దిగిన యూపి సిఎం యోగి**

**ఘటనపై ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి**

లక్నో, జూన్ 22 : ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్ జిల్లా పూర్నియా ప్రాంతంలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన






## రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

- యూరియా ఎమ్మార్పీ ధరలకే అమ్మాలి
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరిక

# కుట్రలతో ప్రభుత్వంపై దుష్ప్రచారం..

(మొదటిపేజీ తరువాయి)

పార్కు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలన్నారు. పీజీఆరఎస్ అర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. అర్జీదారుల స్థానంలో ఉండి ఫిర్యాదులను పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఉద్యోగులు, అధికారులు సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలన్నారు. వినూత్న ఆలోచనలతో పని చేసే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. పనితీరు ఆధారంగానే బాధ్యతలు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలతో వ్యవహరించే సమయంలో సౌమ్యంగా, మర్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు. దీనివల్ల పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ఉద్యోగులు తమ సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకోవాలని చెప్పారు. తప్పుడు ప్రచారాలను, విద్వేషాలు పెంచే ఘటనలను అదుపు చేసేలా ఉద్యోగులు, అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ఇటీవల



కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని సీఎం పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పుదారి పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

# స్వర్ణాంధ్ర లక్ష్యాలపై ఎంఓయూ

## ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చ్‌తో ఒప్పందం

### 15 శాతం వృద్ధిరేటు లక్ష్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, జూన్ 22 ఆంధ్ర మనం :** స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2014-19 మధ్య 13.5 శాతం మేర సీఏజీఆర్ సాధించామని.. వివిధ కారణాల వల్ల ప్రస్తుతం 11 శాతం మేర వృద్ధి రేటు నమోదైందని తెలిపారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రణాళికా విభాగం-కేఆర్ఈఏ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చ్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధనలో పది సూత్రాల అమలుపై ఈ ఎంఓయూ కుదుర్చుకున్నారు. రాష్ట్ర ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఐఎఫ్ఎంఆర్ సంస్థ ప్రతినిధి కపిల్ విశ్వనాధన్ ఒప్పందాలు మార్చుకున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, వృద్ధిరేటు సాధనలో పది సూత్రాల మిషన్ సెల్స్ ఏర్పాటుతో పాటు కార్యక్రమం అమలుపై ఐఎఫ్ఎంఆర్ సంస్థ పర్యవేక్షణ చేయనుంది. జీరో పావర్టీ మిషన్, వాటర్ సెక్యూరిటీ, డీప్ టెక్ మిషన్లపై ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చి సంస్థ రాష్ట్రంలో ప్రభుత్వంతో పనిచేయనుంది.

ఈ ఒప్పందంలో భాగంగా క్షేత్రస్థాయిలో అధ్యయనం, విధాన పరమైన సూచనలు అందిస్తుంది. ఈ 10 సూత్రాలకు సంబంధించి కొత్త పద్దతులకు సిఫారసు చేస్తుంది. తదుపరి దశల్లో మిగిలిన అంశాలపై పనిచేయాలని నిర్ణయించారు. పది సూత్రాల అమలుపై రాష్ట్రస్థాయి కమిటీతో పాటు మిషన్ వర్కింగ్ గ్రూప్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు డీప్ టెక్‌ను ఇంటిగ్రేషన్ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఏఐ స్కిల్లింగ్, డ్రోన్ మ్యాపింగ్ ఆటోమొబైల్, మెటల్స్, స్టీల్, రేర్ ఎర్త్ మినరల్స్, సెమీ కండక్టర్స్, డిఫెన్స్ లాంటి రంగాల్లో ప్రాజెక్టులు ఏపీకి వచ్చాయని అన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీని కూడా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్, కేఆర్ఈఏ, ఐఎఫ్ఎమ్ఆర్ ప్రతినిధులు, ప్రణాళికా విభాగం అధికారులు హాజరయ్యారు.

# మానవీయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం

## ఆర్టీజీఎస్ పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి, జూన్ 22 ఆంధ్ర మనం :** పీజీఆర్ఎస్ సహా ప్రజల నుంచి వచ్చే అర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉద్యోగులు, అధికారులు సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పని తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఉద్యోగులు వినూత్నంగా ఆలోచనలు చేసేలా ప్రోత్సహిస్తాం. పనితీరు ఆధారంగా బాధ్యతలు అప్పగిస్తాం. అర్జీదారుల స్థానంలో ఉండి ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలి. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలి. దీని ద్వారా పాలనపై ప్రజల్లో మంచి భావన కలుగుతుంది. మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు ఉద్యోగులు పాలనా పరంగా సామర్థ్యాలను పెంచుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా పని విధానం మార్చుకోవాలి. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తేనే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోగలుగుతాం. మంత్రులు, అధికారులు, ఉద్యోగులు క్షేత్ర స్థాయి పర్యటనలకు ప్రాధాన్యమివ్వాలి. ఏపీకి బలమైన మానవ వనరుల వ్యవస్థ అవసరం. పాలనలో సంస్కరణలపై ఉద్యోగులకు, అధికారులకు శిక్షణ ఇప్పించాం. పాత రోజుల్లో ఫైళ్ల క్లియరెన్స్ అనేది అతి పెద్ద టాస్క్ గా ఉండేది. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక సులభంగా వాటిని క్లియర్ చేయగలిగే పరిస్థితి ఉంది. వినూత్నంగా ఆలోచన చేయకపోతే వ్యవస్థలు నిర్వీర్యం అవుతాయి."అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

### పాత కేసుల ట్రేసింగ్

"రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయి. ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. వివిధ సంఘటనలకు కులం, మతం అనే రంగు పులుముతున్నారు. వాటిని వివాదాస్పద అంశాలుగా మార్చేస్తున్నారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులను, అధికారులను బద్నాం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి విషయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి. తప్పుడు ప్రచారాలను, విద్వేషాలు పెంచే ఘటనల్ని కంట్రోల్ చేసేలా ఉద్యోగులు, అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలి. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంత మంది నేరాలకు పాల్పడుతున్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పు దారి పడుతున్నారు. పాత కేసులను పరిష్కరిస్తున్నాం. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారు. శిక్షలు కూడా పడుతున్నాయి. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. తప్పు చేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడు. వాహనాల నెంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను పక్కాగా పాటించాలి. ప్రమాణాల ప్రకారం నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలి. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంఛ్ చేయాల్సి ఉంది. ఈలోగా క్వాంటం పార్కు, సెమీ కండక్టర్ల పార్క్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సంరక్షణ, నదీ జలాలను కాలుష్యం నుంచి కాపాడడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జగన్ 2.0తో మారనున్న వ్యూహం?

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ పార్టీలకు కార్యకర్తలే బలమనే అభిప్రాయం ఎప్పటి నుంచో ఉంది. ప్రజలకు సంక్షేమ పథకాలు చేరినా, వాటి రాజకీయ ప్రయోజనం పార్టీ శ్రేణులకు అందకపోవడం వైసీపీకి నష్టంగా మారిందనే విశ్లేషణలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసే బలమైన వ్యవస్థ బలహీనపడటం కూడా ఫలితాలపై ప్రభావం చూపిందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### లోపాలను గుర్తించిన నాయకత్వం

2024 ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీలో జరిగిన సమీక్షల్లో కార్యకర్తల నిర్లక్ష్యం ప్రధాన కారణాల్లో ఒకటిగా గుర్తించినట్లు తెలుస్తోంది. అందుకే ఇప్పుడు పార్టీ కార్యకర్తలతో నేరుగా సమావేశాలు నిర్వహించడం, వారి సమస్యలు తెలుసుకోవడం, భవిష్యత్తులో వారికి ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇవ్వడం వంటి చర్యలకు పార్టీ అధినాయకత్వం ప్రాధాన్యం ఇస్తోంది.



### క్యాడర్‌ను మళ్లీ కదిలించే ప్రయత్నం

నియోజకవర్గాల వారీగా ముఖ్య కార్యకర్తలను కలుస్తున్న జగన్, గతంతో పోలిస్తే మరింత అందుబాటులో ఉంటున్నారనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారిని గుర్తించి, వారికి రాజకీయంగా ప్రాధాన్యం కల్పిస్తామని భరోసా ఇస్తున్నారు. దీనివల్ల క్యాడర్‌లో కొత్త ఉత్సాహం తీసుకురావాలని పార్టీ ప్రయత్నిస్తోంది.

### జగన్ 2.0 ఫలిస్తుందా?

వచ్చే ఎన్నికల నాటికి బలమైన పార్టీ యంత్రాంగాన్ని నిర్మించడమే జగన్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే గతంలో నిరాశకు గురైన కార్యకర్తలు మళ్లీ పూర్తిస్థాయిలో చురుకుగా మారాలంటే కేవలం హామీలు సరిపోవని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. క్షేత్రస్థాయిలో వారికి అండగా నిలవడం, రాజకీయ అవకాశాలు కల్పించడం వంటి అంశాలే నిర్ణయాత్మకంగా మారనున్నాయి. వాలంటీర్ల కంటే కార్యకర్తలకే ప్రాధాన్యత ఇస్తామని జగన్ ప్రకటించడం వైసీపీలో కొత్త ఆశలను రేకెత్తిస్తున్నప్పటికీ, ఈ కొత్త వ్యూహం ఎంతవరకు ఫలిస్తుందనేది రాబోయే రాజకీయ పరిణామాలే తేల్చనున్నాయి.

# 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీ

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం విదేశీ పెట్టుబడులలో 25 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే వస్తుండటం మా ప్రభుత్వ సమర్థతకు నిదర్శనం' అని లోకేష్ గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులు, భూ కేటాయింపులు ఎంత వేగంగా జరుగుతున్నాయో వివరించడానికి మంత్రి కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక రక్షణ ప్రాజెక్ట్ కోసం కేవలం 37 రోజుల్లోనే 600 ఎకరాల భూమిని సేకరించి అప్పగించాం. గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్ట్‌ను కేవలం 13 నెలల రికార్డు కాలంలోనే పట్టాలెక్కించి ప్రభుత్వ స్పీడ్‌ను నిరూపించాం. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు కేవలం ప్రారంభం మాత్రమేనని, అమరావతి ఒక 'సెల్ఫ్-ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్' అని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ. 60,000 కోట్ల నిధుల సవికరణతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఇచ్చిన మాట ప్రకారం.. 2028 నాటికల్లా అమరావతి కోర్ క్యాపిటల్ భవనాలను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ రాజకీయాల్లో ఏపీ ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ కూటమిలో ఏపీ నుంచి ఎక్కువ మంది ఎంపీలు ఉండటం వల్ల దేశ రాజధానిలో మన రాష్ట్ర గొంతు ఎంతో బలంగా వినబడుతోందని అన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్‌ను మడు ప్రధాన ఆర్థిక హబ్‌లుగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి లోకేష్ వివరించారు. విశాఖపట్నం ఐటీ హబ్‌గా, అమరావతి నాలెడ్జ్ హబ్ గా, రాయలసీమ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారబోతున్నాయని అన్నారు. రాజకీయాల్లో మార్పుల గురించి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో స్పష్టమైన 'జనరేషన్ షిఫ్ట్' కనిపిస్తోందని లోకేష్ అన్నారు. తాము యువతకు పెద్దపీట వేస్తున్నామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 50 శాతం మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారేనని మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# లక్నోలో భారీ అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో కోచింగ్ సెంటర్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. మంటలు వేగంగా వ్యాపించడంతో భవనం మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. దీంతో లోపల ఉన్న విద్యార్థులు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో దాదాపు 15 మంది మృతి చెందినట్లు సమాచారం. ఈ భవనంలో కోచింగ్ సెంటర్‌తో పాటు పలు దుకాణాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో ఐదుగురు నుంచి ఏడుగురు విద్యార్థులు భవనం నుంచి దూకినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారిలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పలువురు విద్యార్థులు భవనంలో చిక్కుకుపోయి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అగ్నిప్రమాదంపై స్పందించిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహాయక చర్యలను వేగవంతం చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఘోర అగ్నిప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో ప్రధానమంత్రి జాతీయ ఉపశమన నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజే



యనున్నట్లు ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన ప్రతి ఒక్కరికీ రూ. 50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అలీగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఈ అగ్నిప్రమాదం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఈ ఘటనలో దాదాపు 14 మంది మృతి చెందినట్లు సమాచారం. లఖ్‌నవూ కోచింగ్ సెంటర్ అగ్నిప్రమాద స్థలాన్ని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. అగ్నిప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో కొంతమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనపై పూర్తి వివరాలు సేకరించి నివేదిక అందించాలని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ), అదనపు ప్రధాన కార్యదర్శి (హోం)లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

# నెత్తురోడిన ఏపీ రోడ్లు

## వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

**తిరుపతి, జూన్ 22 :** ఏపీలో రోడ్లు నెత్తురోడాయి. వేర్వేను రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. ప్రకాశం జిల్లాలో ముగ్గురు, తిరుపతి జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం కామేపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన 10 మంది నాదెండ్ల మండలం సంకురాత్రిపాడులో జరిగే దశదిన కర్మకు హాజరయ్యేందుకు ఆటోలో బయల్దేరారు. కామేపల్లి రైల్వే అండర్‌పాస్ సమీపానికి వచ్చేసరికి.. గ్రానైట్‌తో వస్తున్న లారీ మలుపు తిరుగుతూ.. ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుకొండలు (60), రమణమ్మ (50) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన మరో ఏడుగురిని సమీపంలోని వివిధ ఆస్పత్రులకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సుబ్బాయమ్మ (70) ప్రాణాలు కోల్పోయారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం ఉడుంవారిపల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి ఓ ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి కడప వెళ్తోంది. మరోవైపు ఓ లారీ ఎర్రగుంట్ల నుంచి చెన్నైకి వెళ్తోంది. ఉడుంవారిపల్లి వద్దకు రాగానే లారీ.. బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడాది వయసు గల చిన్నారి ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. పలువురికి కాళ్లు, చేతులు తెగిపడి రోడ్డు మొత్తం రక్తసిక్తమైంది. కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను అంబులెన్సులో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విరిగిన చేతిని సైతం అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపడం ప్రమాద తీవ్రతకు అద్దం పట్టింది. రాజంపేట నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అందులో కె. జస్విక (16) అనే బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. కోడూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# సాయికృష్ణ కేసులో విజయవాడ సీపీని సస్పెండ్ చేయాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చ్యేశారు. అసలు సాయికృష్ణను తీసుకురావాలని టాస్క్ ఫోర్స్ పోలీసులను మార్కాపురం పంపింది ఎవరో తేల్చాలని ఆయన కోరారు. ఈ కేసులో నాగరాజుతో పాటు చాలా మంది పెద్దల పాత్ర ఉందని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన అంబటి రాంబాబు అన్నారు. విజయవాడలో గాదె సాయికృష్ణ లాకప్ డెత్, అలాగే పోలీసుల వేధింపుల వల్ల ఆత్మహత్య చేసుకున్న క్రాంతికుమార్ ఘటనలు కలకలం రేపుతున్నాయి. రక్షించాల్సిన పోలీసు స్టేషన్‌లోనే నేరస్తులుగా ముద్ర వేసి భక్షించే కార్యక్రమం చేయడం చాలా దురదృష్టకరం. చిత్రమేమిటంటే.. కొట్టారు, చంపేశారు. ఇక్కడ ఉద్దేశం ఏంటనేది దర్యాప్తులో తేలాలి. సాక్ష్యాధారాలు లేకుండా డెడ్ బాడీని బూడిద చేశారనే ఆరోపణ. ఇలా బహుశా దేశ చరిత్రలోనే ఎక్కడా జరిగి ఉండదనేది నా అభిప్రాయం. మన రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలన జరుగుతుందా లేక భీతావహ పాలన జరుగుతుందా అనే అనుమానం కలుగుతోంది. రాష్ట్ర రాజధాని విజయవాడలో నడిబొడ్డున ఇంత దారుణమైన ఘటన జరిగితే 45 రోజుల వరకూ ఎవరూ మాట్లాడింది లేదు. సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చాక మే 23న చనిపోతే, 24న దహనం చేశారనే సమాచారం ఉంది. ఇందులో వాస్తవం ఏమిటన్నది చెప్పాల్సింది పోలీసులే. కానీ, కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకూ అందరూ నోటికి ప్లాస్టర్ వేసుకున్నారు అని అన్నారు.

# పలు జిల్లాలకు వర్ష హెచ్చరిక

## అప్రమత్తం చేసిన విపత్తు నిర్వహణ శాఖ

**అమరావతి, జూన్ 22 :** ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ మేరకు ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు సంస్థ 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. వర్షంతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని పేర్కొంది. రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 23 నాటికి రుతుపవనాల పురోగతి ఉంటుందని అంచనా వాతావరణ శాఖ వేసింది. మరోవైపు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ స్పందిస్తూ.. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిడుగుపాటు ముప్పు ఉన్నందున ఎట్టిపరిస్థితుల్లోనూ చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్, బహిరంగ ప్రదేశాల్లో నిలబడవద్దని హెచ్చరించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశువుల కాపరులు సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు ప్రమాదంలో తాత, ఏడాదిన్నర చిన్నారి దుర్మరణం

**విజయనగరం, జూన్ 22 :** విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాత, ఏడాదిన్నర చిన్నారి మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. రాపాక కిశోర్, రాపాక ఉమామహేశ్వరి కుటుంబంతో కలిసి కారులో శ్రీకాకుళం నుంచి రాజమండ్రి వైపునకు బయలుదేరారు. మార్గంమధ్యలో వీరు ప్రయాణిస్తున్న కారు.. విజయనగం జిల్లా పోలిపల్లి జాతీయ రహదారిపై అదుపుతప్పి డివైడర్ దాటి రాంగ్ రూటులోకి ప్రవేశించింది. దీంతో ఎదురుగా వచ్చిన లారీని.. వీరి కారును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ముందు సీటులో కూర్చున్న మన్యాల సూరిబాబు, ఒడిలో కూర్చున్న ఏడాదిన్నర చిన్నారి ప్రాణాలు కోల్పోయారు. డ్రైవర్ కారులో చిక్కుకోవడంతో యంత్రాల సాయంతో బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో కారులో ఆరుగురు ఉన్నారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు

## దేశ సంపదను కాపాడే గిరిజన సంక్షేమమే
# కూటమి ప్రభుత్వం లక్ష్యం

### రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



**ఏలూరు/బుట్టాయిగూడెం, జూన్ 22 ఆంధ్ర మనం :** బుట్టాయిగూడెం మండలం కోటరామచంద్రపురం ఐటిడిఎ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసరావు లు, సంబంధిత అధికారులతో కలిసి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధ్యక్షతన, పోలవరం నియోజకవర్గం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. శాఖలు, మండలాలు వారీగా రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పూర్తి అయినవి, పెండింగ్లో ఉన్న పనులు, చేయవలసిన పనులను సుధీర్ఘంగా మంత్రి సమీక్షించారు. అనంతరం ప్రజలు నుండి అర్జీలను మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే చిర్రి బాలరాజులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ దేశ సంపదను కాపాడే గిరిజనులు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, గిరిజన ప్రాంతాలకు పూర్వవైభవం తీసుకు వచ్చేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన విధంగా ఒక కుటుంబంలో ఒకరికి తప్పనిసరిగా ఉపాధి కల్పించేందుకు ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేసి, పక్కాగా అమలు చెయ్యాలని అన్నారు. రాష్ట్రంలో ఒకేరోజు 13 వేలు గ్రామ సభలు నిర్వహించి, పూజ్యభాపూజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం కొరకు ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. రాష్ట్రంలో 7 వేలు కిలోమీటర్లు సీసీ రోడ్డులు వేశామని అన్నారు. పోలవరం ప్రాజెక్టు ఆర్అండ్ఆర్ కు సంబంధించి ఏవైనా సమస్యలుంటే వాటిని విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. గిరిజన ప్రాంతంలోని ఏడు మండలాల్లో ఉపాధిహామీ కింద రూ 30 కోట్లతో రహదారులను అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి, నిర్ణీత సమయంలోగా పూర్తి చెయ్యాలని ఆదేశించారు. గిరిజన సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమానికి అధికార్లు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు. గత ఐదుఏళ్లలో అభివృద్ధి, సంక్షేమం ఈ రెండు ఏళ్లలో జరిగిన కార్యక్రమాలు పూర్తి వివరాలు అందరికీ తెలిసేలా స్వర్ణగ్రామ సచివాలల్లో డిస్ ప్లే చెయ్యాలని ఆదేశించారు. గిరిజనులకు రాజ్యాంగ పరమైన హక్కులు, సంక్షేమ పథకాలు ప్రయోజనాలు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. గిరిజన సమస్యలు పరిష్కారంకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లాలో గిరిజన సమస్యలు పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని అన్నారు. ఇప్పటివరకు విద్యుత్తు సౌకర్యం లేని గిరిజన ప్రాంతంలోని రెండు మండలాల్లో మూడు గ్రామాలకు సోలార్ విద్యుత్తు సౌకర్యం కల్పించుట శుభ పరిణామం అని, అభినందిస్తూ ఇదే స్ఫూర్తితో ప్రతి గిరిజన ఇంటికి సోలార్ ప్యానెల్స్ ఉండేలా గిరిజనులకు అవగాహన కల్పించాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇండ్లకోసం చేసుకున్న ధరఖాస్తులు పరిశీలన చేసి మంజూరుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. నిరుద్యోగ యువతకు పరిశ్రమలు స్థాపనకు అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. జాబు మేళాలు నిర్వహించి చదువుకున్న గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. గిరిజన ప్రాంతంలో విద్యార్హతలు తక్కువగా ఉన్న యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి వారికి ఉపాధి కల్పించేందుకు పక్కా ప్రణాళికలతో అమలు చేసి లక్ష్యాలను అధికమించాలని అన్నారు. పశువులు, మేకలు, గొర్రెలు, తదితర జీవాలు పెంపకానికి రుణాలు కోరిన గిరిజనులకు ఈ ఆర్థిక సంవత్సరంలో నూటికి నూరుశాతం రుణాలను మంజూరు చేయించాలని మంత్రి స్పష్టం చేశారు. డ్వాక్రా మహిళలకు వివిధ వ్యాపారాలకు ఉదారంగా బ్యాంకు రుణాలు మంజూరు చేసేలా అధికారులు కృషిచెయ్యాలని అన్నారు. సమావేశంలో జెడ్పీ సిఈవో పి.జగదాంబ, ఆర్డీవో యం.వి. రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఐ.కిషోరు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, ఏయంసి ఛైర్మన్ పొట్టా రామారావు, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ జయవరపు శ్రీరామూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ జెడి వై.విశ్వమోహన్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ డిడి జి.సత్యనారాయణ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.యు.శోభ, జిల్లా పరిశ్రమలు కేంద్రం జియం ఆర్.వెంకటరావు, జిల్లా, డివిజన్, మండల వివిధ శాఖలు అధికారులు, తహశీదార్లు, యంపిడివో లు, ఐటిడిఏ ఇంజనీరింగు అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘాలు నాయకులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

- యూరియా ఎమ్మార్పీ ధరలకే అమ్మాలి
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరిక



**అమరావతి, జూన్ 22 ఆంధ్ర మనం :** రైతులను ఇబ్బంది పెడితే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, కంపెనీ లపై కూడా చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చె న్నాయుడు హెచ్చరించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఖరీఫ్ – 2026 ఎరువుల లభ్యత, పంపి ణీపై మంత్రి సవిక్ష నిర్వహించారు. వ్యవసా యశాఖ అధికా రులు, ఎరువుల కంపెనీ, అసోషియేషన్ సభ్యులతో సమావేశమ య్యారు. యరియా, డీఏపీతో కాంప్లెక్స్ ఎరువుల బలవంతపు విక్రయాలు ఆపాల న్నారు. రైతులకు అవసరమైన ఎరువులనే అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అవసరమైన మేర కన్నా అధిక ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని మంత్రి చెప్పారు. యరియా సరఫరాలో ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎరువుల బుకింగ్ యాప్ నిర్వహణ సజావుగా ఉండాలన్నారు. నానో యరియా ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సహజ వ్యవసా యంపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోందని తెలిపారు. సాధ్యమైనంత మేర రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని, అధిక ఎరువుల వినియోగంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వెల్లడించారు. ఎమఆర్పీ ధరకే యరియాను విక్రయించాలని, ఎమఆర్ పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీలర్లకు మంత్రి హెచ్చరిక జారీ చేశా రు. యరియా పక్కదారి పట్టకుండా ప్రత్యేక విజిలెన్స్ బృందాలు ఏర్పాటు చేయా లన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండాలన్నారు. గతం లోలా అక్ర మాలు, ఇబ్బందులు సృష్టిస్తే ఉపేక్షించబోమని.. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## అభివృద్ధి పేరుతో అవినీతికి పెద్దపీట

### అమరావతిలో అవినీతికే తాము వ్యతిరేకం

### ఎంపి మిధున్ రెడ్డి ఘాటు విమర్శలు

**మదనపల్లి, జూన్ 22 ఆంధ్ర మనం :** అమరావతి అభివృద్ధికి తమ పార్టీ వ్యతిరేకం కాదని, అక్కడ జరిగే అవినీతికే వ్యతిరేకమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. మదనపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కూటమి ప్రభుత్వంపై పలు విమర్శలు చేశారు. మదనపల్లిని జిల్లాగా ప్రకటించడం తప్ప అభివృద్ధి పరంగా ఎలాంటి పురోగతి లేదని ఆయన ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో మంజూరైన మెడికల్ కళాశాలను కూటమి ప్రభుత్వం అడ్డుకుందని విమర్శించారు. మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తయితే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. మదనప్లలె టౌన్ బ్యాంక్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించిన మిథున్ రెడ్డి, ఈ విషయంపై తెలుగుదేశం పార్టీ నేతలే సమాచారం అందించారని తెలిపారు. దీంతో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలు, భూకబ్జాలు, కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలను చైతన్యపరుస్తామని ఆయన అన్నారు. అభివృద్ధి గురించి ప్రశ్నిస్తే ప్రభుత్వం వైఎస్ జగన్పై వ్యక్తిగత ఆరోపణలు చేయడం తప్ప సమాధానం చెప్పడం లేదని విమర్శించారు. డీఎస్సీ పరీక్షల వ్యవహారంపై కూడా మిథున్ రెడ్డి స్పందించారు. మొదటి ర్యాంక్ సాధించిన అభ్యర్థిని పక్కన పెట్టడంతోనే లీకేజీ వ్యవహారం బయటపడిందని అన్నారు. పరీక్షలు రాసి ఉద్యోగాలు సాధించాల్సిన పరిస్థితిలో అడ్డదారుల్లో ఉద్యోగాలు పొందడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. డీఎస్సీ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మామిడి రైతులు కూటమి ప్రభుత్వ హయాంలో తీవ్రంగా నష్టపోయారని మిథున్ రెడ్డి ఆరోపించారు. రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. అలాగే ఆక్వా రైతులకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు.

### సాయికృష్ణ లాకప్ డెత్ కేసును
# సీబీఐకి అప్పగించాలి

### స్వతంత్ర దర్యాప్తు సాగితేనే కూటమి ప్రభుత్వంపై నమ్మకం

### మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి డిమాండ్

**చిత్తూరు, జూన్ 22 ఆంధ్ర మనం :** సాయికృష్ణ లాకప్ డెత్ కేసును సీబీఐకి అప్పగించాలని వైసీపీ సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి డిమాండ్ చేశారు. చిత్తూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని నమ్మాలంటే ఈ కేసుపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని అన్నారు. సాయికృష్ణ నిజంగా నేరస్తుడే అయితే కోర్టులు శిక్షించి ఉండేవని నారాయణస్వామి పేర్కొన్నారు. టెర్రరిస్టులను ఎన్కౌంటర్ చేసిన సందర్భాల్లో కూడా వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తారని గుర్తు చేశారు. సాయికృష్ణ తల్లి తన కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదని, అయితే ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమెను పిలిపించి మాట్లాడటం ఆశ్చర్యకరంగా ఉందని విమర్శించారు. తమిళనాడులో జరిగిన పోలీసుల లాకప్ డెత్ ఘటనలపై కోర్టులు తీవ్ర వ్యాఖ్యలు చేశాయని, అదే విధంగా సాయికృష్ణ కేసులో కూడా పూర్తి స్థాయి విచారణ జరగాలని నారాయణస్వామి కోరారు.. అలాగే క్రాంతికుమార్ను సీఐ నాగరాజ్ వేధించిన అంశాన్ని కూడా సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. రెడ్బుక్ పాలన వల్లే క్రాంతికుమార్, సాయికృష్ణ మృతికి కారణమైన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన ఆరోపించారు. హోంమంత్రి శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతలను విస్మరించి ముఖ్యమంత్రి చంద్రబాబు భజనకే పరిమితమయ్యారని విమర్శించారు. తిరుపతిలో మంత్రి లోకేష్ రెడ్బుక్ గురించి ప్రస్తావించిన తర్వాత పోలీసులు మరింత రెచ్చిపోతున్నారని ఆరోపించారు. తనను రెడ్బుక్తో పాటు ఎన్ని పుస్తకాల ద్వారా ఇరికించేందుకు ప్రయత్నించినా తాను భయపడబోనని నారాయణస్వామి స్పష్టం చేశారు. తనపై అవినీతి ఆరోపణలు చేయలేమని గతంలో చంద్రబాబే చెప్పారని గుర్తు చేశారు. ఇక, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్పై కూడా నారాయణస్వామి విమర్శలు గుప్పించారు. పవన్ సినిమా నటుడని, ఆయన ఎప్పుడు ఏమి మాట్లాడతారో ఆయనకే తెలియదని వ్యాఖ్యానించారు. ముందుగా కూటమి నాయకులపై ఉన్న క్రిమినల్ కేసులపై చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ను కోరారు. మామిడి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన కిలోకు రూ.4 మద్దతు ధర కూడా వైసీపీ చేపట్టిన పోరాటాల ఫలితమేనని నారాయణస్వామి అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం వైసీపీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు వైసీపీ సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి.



## ఎన్నికల కమిషనర్ను కలిసిన మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి

### ఎస్ఐఆర్ సమస్యలపై వినతి పత్రం అందజేత

**అమరావతి, జూన్ 22 ఆంధ్ర మనం :** రాష్ట్రవ్యాప్తంగా,దేశవ్యాప్తంగా ప్రస్తుతం సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ముస్లిం సమాజంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోందని, గతంలో ఎన్నార్సీ సమయంలో వచ్చినటువంటి భయాందోళనలే ఇప్పుడు మళ్లీ కనిపిస్తున్నాయని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఫారూఖ్ షుబ్లీ,రాష్ట్ర అహ్లే సున్నత్ జమాత్ కన్వీనర్ సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా పేర్కొన్నారు. సోమవారం బందరు రోడ్డులోనీ ఎలక్షన్ కమిషనర్ (ఈసీ) ను కలిసి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్లో సెక్యులర్ భావాలు కలిగిన ప్రాంతీయ పార్టీలు ఉన్నాయని, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ ముస్లింలకు అన్యాయం జరగదని తాము 100 శాతం నమ్ముతున్నామని స్పష్టం చేశారు. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియలో కొన్ని ప్రాక్టికల్ సమస్యలు ఉన్నాయని, వాటిని ఈసీ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. బీహార్, గుజరాత్ కేరళ వంటి ఇతర రాష్ట్రాల నుండి వచ్చి ఇక్కడ నివసిస్తున్న వారి ఓట్లు గల్లంతయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు ముస్లిం సమాజంలోని నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని, ఓట్లు తొలగిపోతాయని, పథకాలు రావంటూ భయానకమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఎస్ఐఆర్ గనుక పక్షపాతం లేకుండా నిష్పక్షపాతంగా జరిగితే స్థానికులకు అన్ని రకాల ప్రభుత్వ పథకాలు అందుతాయని, డబుల్ బెనిఫిట్స్ పొందుతున్న వారికి అడ్డుకట్ట పడుతుందని తెలిపారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 65 నియోజకవర్గాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి ఫామ్–6, ఫామ్–8 నమోదుపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నిబంధనల ప్రకారం బూత్ లెవెల్ ఏజెంట్లు , బూత్ లెవెల్ ఆఫీసర్ లతో కలిసి రావాల్సి ఉన్నా, క్షేత్రస్థాయిలో అది జరగడం లేదని విమర్శించారు. బీఎల్ఓలు వేరే పనుల్లో బిజీగా ఉంటూ కేవలం ఫారాలు చేతిలో పెట్టి పూర్తి చేయమంటున్నారని, వాటిలో ఏ చిన్న తప్పు ఉన్నా పక్కన పెట్టేస్తున్నారని ఆరోపించారు. ఈ వన్–మంత్ ప్రాసెస్ (నెల రోజుల సమయం) ఏమాత్రం సరిపోదని, అందువల్ల ఎస్ఐఆర్ గడువును పొడిగించాలని ఎన్నికల కమిషనర్ను కోరారు. ఆన్లైన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియ చేసేటప్పుడు సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వివరించారు. ఆధార్ కార్డులో సర్నేమ్ (ఇంటి పేరు) మొదట్లో ఉంటే, ఓటర్ ఐడీలో చివర్లో ఉంటోందని.. ఈ రెండింటినీ ఎంటర్ చేసినప్పుడు 'మిస్మ్యాచ్' అని చూపిస్తూ దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని ఈసీకి వివరించారు. దీనిపై ఎన్నికల కమిషనర్ సానుకూలంగా స్పందించారని, ముస్లిం, క్రిస్టియన్, హిందూ అనే భేదం తమకు లేదని, అందరికీ న్యాయం జరిగేలా సమగ్ర విచారణ జరిపి మంచి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. ఈ సి నీ కలిసిన వారిలో , మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా హుస్సేన్, జమీయత్ అహలె హదీస్ అధ్యక్షులు నసీర్ అహ్మద్ ఉన్నారు. ప్రభుత్వ ఖాజీ హాఫిజ్ అబ్దుల్ సమద్ తదితరులు పాల్గొన్నారు.



### కార్మిక సంక్షేమ పథకాల అమలులో
## సాంకేతికతకు ప్రాధాన్యత

### మంత్రి వాసంశెట్టి సుభాష్

**అమరావతి, జూన్ 22ఆంధ్ర మనం :** ఆంధ్రప్రదేశ్ కార్మికుల వెల్ఫేర్ బోర్డు 45వ సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సంక్షేమ కార్యక్రమాలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా కార్మికులకు చేరవేసేందుకు రూపొందించిన సంక్షేమ బోర్డు నూతన వెబ్సైట్ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని కార్మికులకు సంక్షేమ పథకాల సేవలను సులభతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నూతన వెబ్సైట్ ద్వారా కార్మికుల నమోదు, సంక్షేమ పథకాల దరఖాస్తులు, లబ్ధిదారుల వివరాలు, పథకాల మార్గదర్శకాలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి సేవలు ఆన్లైన్లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, కార్మికులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా డిజిటల్ వేదికలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. 45వ బోర్డు సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, నమోదు ప్రక్రియల సరళీకరణ, కార్మికుల భద్రత, సామాజిక భద్రతా కార్యక్రమాల విస్తరణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సెక్రటరీ ఎంబీ శేషగిరి బాబు, అడిషనల్ సెక్రటరీ మరియు కమిషనర్ గంధం చంద్రుడు వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ వెంకట శివుడు యాదవ్,వెల్ఫేర్ బోర్డు సభ్యులుఎ. వెంకట రమణి, ఆరా మహేశ్వరి, అరవరాజు నేలపాల, గదుల సాయిబాబు, బి విశ్వనాథ నాయుడు,డి. నారపరెడ్డి, చింత రేణుక రాజు, నల్లగొప్పుల వెంకట చలపతిరావు, పిడుగు వెంకటరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ప్రజలను మోసం చేస్తున్న
# డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

### ఆయనది ద్వంద్వ వైఖరి అంటూ మండిపడ్డ అంబటి రాంబాబు



**అమరావతి, జూన్ 22 ఆంధ్ర మనం :** సాయికృష్ణ కేసు నుంచి సుగాలీ ప్రీతి ఉదంతం వరకు ప్రతి విషయంలోనూ డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ప్రజలను, బాధితులను మోసం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీమంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. ఒకవైపు ప్రభుత్వం సాయికృష్ణ కుటుంబాన్ని పిలిపించి న్యాయం చేస్తామని చెబుతుంటే.. మరోవైపు పవన్ కళ్యాణ్ ఏమో సాయికృష్ణను ఒక క్రిమినల్ అని మాట్లాడుతున్నారని అన్నారు. ఈ మేరకు పవన్ కళ్యాణ్ తీరుపై అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతిలో జరిగిన ప్రెస్ విట్లో ఆయన మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. అదే సమయంలో జనసేన నేత సామినేని ఉదయభాను సాయికృష్ణ తల్లిని ఓదార్చేందుకు వెళ్లి.. పవన్ కళ్యాణ్ పంపిస్తేనే వచ్చామని చెబుతున్నారు. అసలు పవన్ ఏం చెప్పాలను కుంటున్నారో ఆయనకే తెలియాలి అని అన్నారు. వైసిపి నేతలను తాటతీస్తామంటూ పవన్ చేస్తున్న వ్యాఖ్యలపై అంబటి మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఇలా మాట్లాడొచ్చా? వి ఎమ్మెల్యే పంతం నానాజీ భాష ఎలా ఉందో చూశారా? అసలు ఎవరు గూండాలు? పవన్ గారూ.. విరు ఏడు జన్మలెత్తినా మమ్మల్ని ఏవి చేయలేరు. వి ఉడత ఊపులకు, సొల్లు కబుర్లకు ఇక్కడెవరూ భయపడరని స్పష్టం చేశారు. 'నేను హోంమంత్రిగా లేకపోవడం వి అదృష్టం' అని పవన్ అనడం ద్వారా ప్రస్తుతం ఉన్న హోంమంత్రి సరిగ్గా పని చేయడం లేదని ఆయనే ఒప్పుకున్నట్లయిందని అంబటి ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్కు హోంమంత్రి పదవి ఇవ్వాలని తాను సీఎం చంద్రబాబును రిక్వెస్ట్ చేస్తున్నానని పేర్కొన్నారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, ముంబై దాడుల నిందితుడు కసబ్ను కూడా చట్టప్రకారమే శిక్షించారని గుర్తు చేశారు. సాయికృష్ణ కేసులో ఒక అధికారి విచారణ జరుపుతుండగా హఠాత్తుగా 'సిట' వేయడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేకనే ఈ నాటకాలు ఆడుతున్నారని, ఈ కేసులో వాస్తవాలు బయటకు రావాలంటే సీబీఐ లేదా ఎనఐఏ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కోనసీమలో కాపు నేతల సమావేశంపై పవన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, గతంలో కులాల గురించి పవన్ మాట్లాడినట్లుగా ఈ రాష్ట్రంలో ఎవరూ మాట్లాడి ఉండరని అంబటి రాంబాబు దుయ్యబట్టారు. ఒకవైపు సాయికృష్ణ ఇంటికి జనసేన నేతలను పంపుతూ.. మరోవైపు ఈ కేసులో నిందితుడైన సీఐ నాగరాజును అరెస్ట్ చేయవద్దని ఆందోళనలు చేయించడం పవన్ దుర్మార్గపు రాజకీయాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నేడు పులివెందులకు జగన్

### మూడ్రోజుల పాటు ఇక్కడే మకాం

**కడప, జూన్ 22 ఆంధ్ర మనం :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు మూడు రోజుల పాటు పులివెందులలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ప్రజలను కలుసుకోవడంతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. తన పర్యటనలో భాగంగా ఈ నెల 23వ తేదీ సాయంత్రం 4 గంటలకు వైఎస్ జగన్ పులివెందులకు చేరుకోనున్నారు. అనంతరం భాకరాపురం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించే ప్రజాదర్బార్లో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. రాత్రికి పులివెందులలోని తన నివాసంలో బస చేయనున్నారు. ఇక, 24వ తేదీ ఉదయం 9 గంటలకు పులివెందుల నుంచి బయలుదేరి వేముల మండలం భూమయ్యగారిపల్లెకు చేరుకోనున్నారు. అక్కడ గట్టు లక్ష్మీనరసింహ స్వామి వారి నూతన దేవాలయ ప్రారంభోత్సవ మహోత్సవాల్లో పాల్గొంటారు. ఆలయ కార్యక్రమాలు ముగిసిన అనంతరం తిరిగి పులివెందుల క్యాంప్ కార్యాలయానికి చేరుకుని ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. అనంతరం రాత్రికి పులివెందులలోని తన నివాసంలో బస చేస్తారు. మరోవైపు, 25వ తేదీ ఉదయం 8 గంటలకు పులివెందుల నుంచి తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ మూడు రోజుల పర్యటనలో ప్రజలను కలుసుకోవడంతో పాటు స్థానిక సమస్యలపై కూడా ఆరా తీసే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.




## ఫిలిప్పీన్స్‌లో కాల్పుల కలకలం

**స్కూల్లో కాల్పులకు తెగిచిన సాయుధులు**

**ముగ్గురు విద్యార్థులు అక్కడిక్కడే మృతి**

**న్యూఢిల్లీ, జూన్ 22 :** ఫిలిప్పీన్స్‌లో దారుణం జరిగింది. టాక్లోబన్‌లోని శాన్ హోసే నేషనల్ హైస్కూల్‌లో కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. ఇద్దరు సాయుధులు అక్రమంగా పాఠశాల ఆవరణలోకి ప్రవేశించి విద్యార్థులపై విచక్షణా రహితంగా తుపాకులతో కాల్పులకు తెగబడ్డారు. ఈ దాడిలో ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో ఐదుగురికి తీవ్రమైన బబుల్లెట్ గాయాలు అయ్యాయి. ఫిలిప్పీన్స్‌లో కొద్దికాలంగా అక్రమ ఆయుధాల చలామణి పెరిగిపోయింది. దీంతో ఇటీవల తుపాకీ సంబంధిత నేరాలు సర్వసాధారణం అయిపోయాయి. అయితే, పాఠశాలల్లో కాల్పులకు తెగబడటం చాలా అరుదైన ఘటనని స్థానిక మీడియా, అధికారులు చెబుతున్నారు. ఈ పాఠశాలలో మొత్తం 1,500మంది విద్యార్థులు ఉండగా.. కాల్పుల ఘటనతో పాఠశాల సిబ్బంది సహా వారంతా బయటకు పరుగులు తీశారు. పాఠశాల యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి దాడికి ఉపయోగించిన తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. అయితే, నిందితుల్లో ఒకరిని అదే పాఠశాలకు చెందిన విద్యార్థిగా పోలీసులు గుర్తించారు. మరోవైపు దాడిలో గాయపడిన ఐదుగురిని సమీప ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనతో స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ మేరకు పాఠశాల చుట్టుపక్కల ప్రాంతమంతా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాల్పులకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.



## చిత్తూరు జిల్లాలో దారుణ ఘటన

**ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బలవన్మరణం**

**చిత్తూరు, జూన్ 22 :** చిత్తూరు జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన దిగుమసపల్లె పంచాయతీ బంగారెడ్డిపల్లిలో జరిగింది. దామోదరం(30) అనే వ్యక్తి.. తన భార్య నిర్మల(25), కుమారుడు రాజేష్, కుమార్తె శ్రీవిద్యకు విషమిచ్చి, అనంతరం తానూ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కొన్ని రోజులుగా సీఎంసీ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. భార్య ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడం, ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉండటంతో దామోదరం ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న బీఎన్ఆర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దామోదర్.. సూసైడ్ నోట్‌లో బ్యాంకు ఏటీఎం కార్డు, ఫోన్‌పే పిన్ నెంబర్ రాసిపెట్టాడు. అంత్యక్రియలకు తన ఖాతా నుంచే డబ్బులు వాడుకోవాలని లేఖలో పేర్కొన్నాడు.

## శ్రీచరణ్ అన్ని లిమిట్స్ దాటాడు

**రాధాగాయత్రి చివరి ఫోన్ కాల్ ఆడియో**

**విశాఖపట్నం, జూన్ 22 :** విశాఖకు చెందిన టెకీ రాధాగాయత్రి మృతి కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. భర్తతో కలిసి ఉత్తరాఖండ్ వెళ్లిన రాధాగాయత్రి అక్కడి హోమ్‌స్టేలో మృతిచెందిన విషయం తెలిసిందే. మొదట అనుమానాస్పద కేసుగా నమోదు అయినప్పటికీ.. గాయత్రి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త శ్రీచరణ్‌పై ముస్సోరి పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. తాజాగా రాధాగాయత్రికి చెందిన చివరి ఆడియో వెలుగులోకి వచ్చింది. భర్త ప్రవర్తనపై గాయత్రి తన తల్లితో చెప్పుకుని ఆవేదన వ్యక్తం చేసింది. 'నా మనసు పూర్తిగా విరిగిపోయింది. నా మీద అనుమానం, నా గురించి చెడుగా ప్రచారం చేస్తున్నాడు. నేనేదైనా తప్పు చేస్తే నేరుగా అడగమని మా అత్తయ్యతో అన్నాను. నేను ఇక నా భర్తతో మాట్లాడదలుచుకోవడం లేదు. ఏదైనా ఉంటే మా అమ్మవాళ్లతో మాట్లాడమని చెప్పా. ఇన్నాళ్లూ ఓపిక పట్టాను. నా భర్త అన్ని లిమిట్స్ క్రాస్ అయిపోయాడు' అని ఫోన్‌లో రాధాగాయత్రి చెబుతున్నట్లు ఆడియోలో ఉంది. తల్లితో గాయత్రి ఫోన్ సంభాషణ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.


## బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా

**బ్రిటన్ :** బ్రిటన్‌లో మరోసారి రాజకీయ అస్థిరత నెలకొంది. ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామా చేశారు. లేబర్ పార్టీ ఒత్తిడి వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పదవిలో ఉన్నంత కాలం విలువలకు కట్టుబడి పని చేసినట్లు తెలిపారు. తాజా పరిణామంతో బ్రిటన్‌లో దశాబ్ద కాలంలో తమ పదవులకు రాజీనామా చేసిన ప్రధానుల సంఖ్య ఆరుకి చేరింది. కీర్ స్టార్మర్ 2024లో బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎన్నికల్లో లేబర్ పార్టీ పేలవమైన ప్రదర్శన మాత్రమే ఇవ్వడం, మేకర్‌ఫీల్డ్ పార్లమెంటరీ ఉపఎన్నికలో బర్న్‌హామ్ ఘన విజయం సాధించడంతో స్టార్మర్ నాయకత్వంపై ప్రశ్నలు వస్తున్నాయి. ఎప్‌స్టీన్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తన స్నేహితుడు పీటర్ మాండెల్సన్‌ను అమెరికాలో యూకే రాయబారిగా నియమించాలనే స్టార్మర్ నిర్ణయంపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో తాను ప్రధాని పదవి నుంచి వైదొలగాలని సహచర మంత్రులతోపాటు సొంత పార్టీ ఎంపీల నుంచి ఆయనపై ఒత్తిడి పెరిగింది. అయినప్పటికీ తాను పదవి నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని వాదిస్తూ వచ్చిన స్టార్మర్.. తాజాగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. మరోవైపు, బ్రిటన్ ప్రధానిగా కీర్ స్టార్మర్ రాజీనామా చేస్తారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. వలసలు, ఇంధన విధానాల్లో వైఫల్యాలే అందుకు కారణమని తన పోస్టులో ఆయన పేర్కొన్నారు.

# సింధుజలాలపై అవసరమైతే యుద్ధం

**భారత్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం**

**పాక్ రక్షణ మంత్రి ఖవాజా ప్రేలాపనలు**



**ఇస్లామాబాద్, జూన్ 22 :** సింధు జలాల కోసం అవసరమైతే భారత్‌తో యుద్ధం చేస్తామని పాక్ ప్రగల్భాలు పలికింది. సింధు జలాల ఒప్పందం విషయంలో వెనక్కి తగ్గేది లేదని భారత్ స్పష్టం చేసిన నేపథ్యంలో, పాకిస్థాన్ రక్షణమంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. భారత్ చర్యలు తమ నీటి సరఫరాకు ముప్పు కలిగిస్తున్నాయని, అవసరమైతే ఆ దేశంపై యుద్ధానికి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాజాగా హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం సింధు జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఉగ్రవాదానికి పూర్తిగా, విశ్వసనీయంగా అడ్డుకట్ట వేయకపోతే ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని భారత్ తేల్చి చెప్పింది. కాగా, పాకిస్థాన్‌కు వచ్చే నీటి ప్రవాహాన్ని తగ్గించే లేదా అడ్డుకునే ప్రయత్నాలు జరిగితే అది జాతీయ భద్రతా సమస్యగా మారుతుందని ఆసిఫ్ అన్నారు. పాక్ ఆర్థిక వ్యవస్థ, కోట్లాది మంది ప్రజల జీవనాధారం సింధు నదీ వ్యవస్థపై ఆధారపడి ఉందని ఆసిఫ్ అన్నారు. ఈ నేపథ్యంలో నీటి హక్కులను కాపాడుకునేందుకు అన్ని మార్గాలనూ ఉపయోగిస్తామని, అవసరమైతే యుద్ధం వరకు వెళ్లడానికి కూడా వెనుకాడబోమని ఆసిఫ్ హెచ్చరించారు. సింధు జలాల ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం సింధు నదీ వ్యవస్థలోని ఆరు నదులను భారత్, పాకిస్థాన్‌కు సమానంగా కేటాయించారు. ఒప్పందం ప్రకారం రావి, బియాస్, స్లటెజ్ నదులపై భారత్‌కు హక్కులుంటాయి. సింధు, జీలం, చీనాబ్ నదులపై పాకిస్థాన్‌కు హక్కులుంటాయి. అలాగే పాకిస్థాన్‌కు కేటాయించిన మూడు నదులపై కూడా భారత్‌కు కొన్ని పరిమిత హక్కులు ఉన్నాయి. పాక్‌కు కేటాయించిన నదులపై భారత్ జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మించుకోవచ్చు. తాగునీరు, గృహ అవసరాలకు నీటిని వినియోగించుకోవచ్చు. అలాగే పరిమిత స్థాయిలో సాగునీటికి కూడా ఉపయోగించు కోవచ్చు. అయితే నదుల ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకునే హక్కు భారత్‌కు లేదు. కాగా, ఇటీవలి ఉగ్రవాద ఘటనల తర్వాత భారత్ ఈ ఒప్పంద అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఉగ్రవాదానికి మద్దతు కొనసాగితే పాత విధానంలో ఒప్పందం కొనసాగదని భారత్ స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో చీనాబ్, జీలం నదులపై కొన్ని ప్రాజెక్టులు నిర్మిస్తోంది. ఈ నిర్మాణాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

## ఖతార్ గ్యాస్ క్షేత్రంలో భారీ పేలుడు

**54మందికి తీవ్ర గాయాలు..18మంది ఆచూకీ గల్లంతు**



**ఖతార్, జూన్ 22 :** ప్రపంచ గ్యాస్ వాణిజ్యానికి ఆయువుపట్టు వంటి ఖతార్ రస్ లఫాన్ క్షేత్రంలో బర్జాన్ ప్లాంట్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 54 మంది గాయపడగా.. 18మంది జాడ గల్లంతైంది. ఈ పేలుడుతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అయితే పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అలాగే ప్రాణనష్టంపై వివరాలు అందాల్సి ఉంది. వాస్తవానికి ఇరాన్-అమెరికా యుద్ధం వేళ ఐఆర్‌జీసీ దళాలు ఈ గ్యాస్ క్షేత్రాన్ని లక్ష్యంగా చేసుకొని భారీగా దాడులు చేశాయి. దీంతో గ్యాస్ ప్లాంట్ దెబ్బతిని భారీగా ఉత్పత్తి సామర్థ్యం పడిపోయింది. కొన్నాళ్ల క్రితమే ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గు ముఖం పట్టడంతో గ్యాస్ ఉత్పత్తి తిరిగి ప్రారంభించేందుకు ఖతార్ చర్యలు చేపట్టింది. ఖతార్ రాజధాని దోహాకు ఈశాన్యంగా 80 కిలోమీటర్ల దూరంలో పర్షియన్ గల్ఫ్ తీరంలో రస్ లఫాన్ నగరం ఉంది. భౌగోళికంగా వ్యూహాత్మక ప్రదేశంలో ఉండటంతో ఇది ఆసియా, ఐరోపా ఎగుమతులకు అత్యంత అనువైన ప్రదేశం. ఇక్కడి నుంచి గ్యాస్ దాదాపు 30 దేశాలకు పైగా ఎగుమతి అవుతోంది. వీటిల్లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన జపాన్, దక్షిణ కొరియా, భారత్, ఐరోపా సమాఖ్య, చైనా వంటి దేశాలు ఉన్నాయి. భారత ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో ఖతార్ నుంచి 40-47శాతం వరకు హర్మూజ్ జలసంధి దాటుకొని వస్తున్నాయి. ఈ గ్యాస్ క్షేత్రాన్ని ఖతార్ ఎనర్జీనే నిర్వహిస్తుంది. భారత్-ఖతార్ మధ్య 2024లో 78 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం జరిగింది. దీని ప్రకారం 2028 నుంచి 20 ఏళ్లపాటు ఏటా 7.5 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీ సరఫరా చేయాల్సి ఉంటుంది. ఖతార్ ఎల్ఎన్‌జీ భారత్‌లో విద్యుత్తు, ఎరువుల ఉత్పత్తి, పరిశ్రమలు, గృహోపయోగానికి చాలా కీలకం. అమెరికా, ఆఫ్రికాతో పోల్చుకొంటే ఇక్కడి నుంచి భారత్‌కు గ్యాస్ తరలించడం చాలా చౌక.



## మాస్కోపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

**డ్రోన్‌లతో వరుస దాడులతో రష్యా ఉక్కిబిక్కిరి**

**మాస్కో, జూన్22 :** రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు కొనసాగిస్తోంది. మాస్కో, దాని పరిసరాల ప్రాంతాలే లక్ష్యంగా ఆదివారం వందల డ్రోన్లతో విరుచుకుపడింది. వాటిలో దాదాపు 60 డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా ఎయిర్ డిఫెన్స్ అధికారులు వెల్లడించారు. దాడుల నేపథ్యంలో నగరంలోని నాలుగు విమానాశ్రయాలు మూతపడ్డాయి. క్రిమియాపై కూడా ఉక్రెయిన్ దాడులకు పాల్పడుతుండడంతో అదనపు భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా క్రిమియాలో సోమవారం జరగాల్సిన అన్ని బహిరంగ కార్యక్రమాలను అధికారులు రద్దు చేశారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. ఇంధన సదుపాయాలు, చమురు శుద్ధి కేంద్రాలపై కీవ్ దాడులు చేయడంతో క్రిమియా ప్రాంతంలో ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. దీంతో నగరవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ స్టేషన్లలో ప్రజలకు, ప్రభుత్వేతర సంస్థలకు ఇంధన విక్రయాలను నిలిపివేశారు. విరామం ఇవ్వకుండా ఉక్రెయిన్ ప్రతిరోజూ వందల డ్రోన్‌లతో విరుచుకు పడుతుండడంతో మాస్కో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌లోని దక్షిణ ఒడెసా ప్రాంతంపై రష్యా చేసిన ప్రతిదాడుల్లో ఒకరు మరణించగా.. ముగ్గురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో పలు వాహనాలు ధ్వంసమవ్వగా.. ఇంధన నిల్వ ట్యాంకులలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

## సిఎం హోదాలో విజయ్ తొలి పుట్టినరోజు



**చెన్నై, జూన్ 22 :** తమిళనాడు రాజకీయాల్లో ప్రభంజనం సృష్టిస్తూ ఎన్నికల్లో పోటీచేసిన తొలిసారే విజయాన్ని సాధించిన విజయ్ ముఖ్యమంత్రి హోదాలో సోమవారం పుట్టినరోజు చేసుకున్నారు. దీంతో సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం రాత్రి శివకాశిలో గంటసేపు బాణాసంచా కాల్చి అభిమానులు సందడి చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. మీరు దీర్ఘాయుష్షుతో జీవించాలని ప్రార్థిస్తున్నాను అంటూ ప్రధాని మోదీ సందేశం తెలిపారు. విజయ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. అన్ని ప్రయత్నాలలో మీరు విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను. తమిళ ప్రజల హక్కులు, గౌరవం, ఆకాంక్షలను పరిరక్షించడంలో, రాష్ట్ర ప్రగతి కోసం కలిసి పనిచేయడంలో నేను మీకు అండగా నిలుస్తానని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అభినందనలు తెలిపారు. విజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నా. మీరు చేపట్టే అన్నీ ప్రయత్నాల్లో విజయం సాధించాలని.. ప్రజలకు ఇలానే సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలియచేశారు.

## అమెరికాలో మరో తెలుగు విద్యార్థి మృతి

**హైదరాబాద్, జూన్ 22 :** ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లిన మరో తెలుగు విద్యార్థి అనూహ్యంగా ప్రాణాలు కోల్పోయాడు. తెలంగాణకు చెందిన 26 ఏళ్ల అరుణ్ సాయి రెడ్డి బొలెందుల అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. అరుణ్ స్వస్థలం మహబూబ్‌నగర్. ప్రస్తుతం ఫ్లోరిడాలోని టెంపాలో నివసిస్తోన్న అతడు.. స్టెమ్ ఓపీటీలో ఉన్నాడు. ఫుల్ టైమ్ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తోన్న అరుణ్.. జూన్ 19న ఉన్నట్టుండి అనారోగ్యానికి గురయ్యాడు. ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## తల్లి మందలింపుతో పారిపోయిన అక్కాచెల్లెళ్లు

**ఏలూరులో ప్రత్యక్షమైన సోదరీమణులు**

**హైదరాబాద్, జూన్ 22 :** తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయిన ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. హైదరాబాద్‌లో అదృశ్యమైన ఆ ముగ్గురూ ఏపీలో ప్రత్యక్షమయ్యారు. ఈ ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫోన్ ఎక్కువగా చూస్తున్నారని తన ముగ్గురు కుమార్తెలను తల్లి మందలించింది. దీంతో ఆ ముగ్గురూ ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీంతో తన పిల్లలు కనిపించడం లేదని వారి తల్లి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. ఏలూరులో ఉన్నట్లు తేలింది. వారిని తిరిగి హైదరాబాద్ తీసుకొస్తున్నారు.

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన

- నాంపల్లి కోర్టుకు హాజరుకాని అల్లు అర్జున్
- షూటింగ్‌ల కారణంగా రాలేకపోయారని వివరణ
- విచారణ జూలై 6కు వాయిదా వేసిన కోర్టు



**హైదరాబాద్, జూన్ 22 :** హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసుపై నాంపల్లి కోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న పలువురు కోర్టు ముందు హాజరుకాగా, సినీ నటుడు అల్లు అర్జున్ వ్యక్తిగత కారణాలతో హాజరుకాలేకపోయారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. సంధ్య థియేటర్ కేసులో నాంపల్లి కోర్టుకు సినీనటుడు అల్లు అర్జున్ హాజరు కాలేదు. షూటింగ్ వల్ల వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి ఇవాళ కోర్టుకు హాజరుకావాలని 19 మంది నిందితులకు ఇటీవల నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, అల్లు అర్జున్ మినహా మిగతా నిందితులంతా న్యాయమూర్తి ఎదుట హాజరై బాండ్లపై సంతకాలు చేశారు. అనంతరం కేసు విచారణను న్యాయమూర్తి కేసు విచారణను జులై 6కి వాయిదా వేశారు. అనంతరం ఈ కేసు విచారణను జులై 6వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను ఎ11 నిందితుడిగా పోలీసులు చేర్చిన విషయం తెలిసిందే. వ్యక్తిగతంగా అర్జున్ కోర్టు ముందు హాజరు కావాలని సమన్లు జారీ చేశారు. అయితే అల్లు అర్జున్ గైర్హాజరుకు గల కారణాలను న్యాయస్థానానికి ఆయన తరఫు న్యాయవాది వివరించారు. సంధ్యా థియేటర్ యాజమాన్యాన్ని తొలి పదిమంది జాబితాలో చేర్చగా, మొత్తం 23 మందిపై పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 19 మంది నిందితులకు నాంపల్లి కోర్టు ఇప్పటికే సమన్లు జారీ చేసింది. ఈ ఘటన 2024 డిసెంబర్ 4వ తేదీన పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ వద్ద చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో అభిమానులు థియేటర్‌కు చేరుకోవడంతో తొక్కిసలాట జరిగింది. ఘటనలో రేవతి అనే మహిళ మృతిచెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ కేసు దర్యాప్తు పూర్తిచేసిన పోలీసులు 23 మందిని నిందితులుగా పేర్కొంటూ నాంపల్లి కోర్టుకు ఛార్జ్‌షీట్ సమర్పించారు. నిందితుల వ్యక్తిగత హాజరు ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ కేసులో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు నాంపల్లి కోర్టు సిద్ధమవుతోంది. ఈ కేసు సినీ, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారగా, కోర్టు తదుపరి విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.




## అమెరికాకు షాకిచ్చిన చైనా

**పలు రక్షణ కంపెనీలపై ఆంక్షలు**

**బీజింగ్,జూన్22 :** అమెరికాకు చెందిన 10 సైనిక సంబంధిత కంపెనీలపై చైనా ఆంక్షలు విధించింది. ఆయా కంపెనీలకు పౌర-మిలిటరీ వినియోగ వస్తువుల ఎగుమతిని నిషేధిస్తున్నట్లు తెలిపింది. వీటిల్లో రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. అగ్రరాజ్యం ఇటీవల తమ రక్షణ రంగ కాంట్రాక్టుల్లో చైనా టెక్ కంపెనీలను నిషేధించిన నేపథ్యంలో బీజింగ్ ఈ చర్యలు చేపట్టింది. దీంతో పాటు అమెరికాకు చెందిన 46 కంపెనీల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా తమ ప్రభుత్వ రంగ సంస్థలను నిరోధించనున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతే కాకుండా ఇతర దేశాలు చైనా నుంచి కొనుగోలు చేసిన వస్తువులను.. ఆంక్షలకు గురైన అమెరికా కంపెనీలకు బదిలీ చేయడాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపింది. చైనా సైన్యంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అలీబాబా, బైడూ సహా పలు టెక్ కంపెనీలపై ఈ నెల ఆరంభంలో అమెరికా రక్షణ శాఖ నిషేధం విధించింది. ఇకపై ఆయా కంపెనీలు అగ్రరాజ్య సైనిక కాంట్రాక్టులను పొందలేవని తెలిపింది. ఈ ఏడాది మే నెలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయిన ట్రంప్.. ఇరు దేశాల మధ్య పరస్పర వాణిజ్య సహకారంపై అంగీకారానికి వచ్చారు. అయితే, నెల తిరక్కుండానే బీజింగ్ కంపెనీలపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించడం గమనార్హం. దీంతో బీజింగ్ కూడా ప్రతిచర్యలు చేపట్టింది.

ఆంధ్ర మనం

మంగళవారం జూన్ 23 2026

## వికలాంగుల పట్ల మానవతా దృక్పథంతో స్పందించిన జిల్లా కలెక్టర్

### నలుగురు వికలాంగులకు రూ.2 లక్షల తక్షణ ఆర్థిక సాయం అందజేసిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి, జూన్ 22 ఆంధ్ర మనం**



మానవతా దృక్పథంతో స్పందించిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, కరకంబాడి సమీపంలోని బీసీ కాలనీలో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన నలుగురు వికలాంగులకు రూ.2 లక్షల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ఎస్) కార్యక్రమంలో గంప పరశురామయ్య గంప మునెమ్మ దంపతుల సంతానం అయిన గంప చంద్రశేఖర్, గంప రాజేశ్వరి, గంప రవి మరియు అదే కుటుంబానికి చెందిన దేరంగుల వీరభద్ర అను వారు తమ దయనీయ పరిస్థితిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కుటుంబంలో నలుగురు సభ్యులు మానసిక, శారీరక వికలాంగులుగా బాధపడుతున్న నేపథ్యంలో ఆర్థిక సహాయం కావాలని కోరారు. వారి పరిస్థితిని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, తక్షణ సాయంగా రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ ఆర్థిక సహాయం గంప చంద్రశేఖర్, గంప రాజేశ్వరి, గంప రవి, దేరంగుల వీరభద్ర అనే నలుగురు వికలాంగులకు అందించారు. ఈ పరిస్థితిని గుర్తించిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మానవతా దృక్పథంతో వెంటనే సహాయం అందించడం పట్ల కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నలుగురు వికలాంగులకు పెన్షన్, సదరం సర్టిఫికెట్ లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు , శ్రీ జనతా సేవా మిత్ర హెల్పింగ్ హాండ్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కాపులకు వెన్నుపోటు పొడించింది వైసిపినే: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుప తి, జూన్ 22 ఆంధ్ర మనం :**



దేశం, సమాజం బాగుండాలని కోరుకునే పవన్ కళ్యాణ్‌కు కులం రంగు పూసేందుకు వైసిపి చేసే కుట్రలను ప్రజలు తిరస్కరిస్తారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. కాపు యువకుడు సాయి కృష్ణ లాకప్ డెత్ ను అడ్డం పెట్టుకుని పవన్ కళ్యాణ్ పై వైసిపి కాపు నాయకులు అసత్య ఆరోపణలు చేశారని ఆయన విమర్శించారు. తన కార్యాలయంలో సోమవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు. వైసిపి కాపు నాయకులు కోనసీమలో సమావేశమై రెండేళ్ళ ఎన్డీఏ కూటమి పాలనలో కాపులకు అన్యాం జరుగుతున్నదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. కాపు, బలిజలకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదని ఆయన ఆరోపించారు. కులం లేదు అని చెప్పే పవన్ కళ్యాణ్ పిఠాపురంలో ఎందుకు పోటీ చేశారు అని అడిగే అర్హత వైసిపి కి లేదని ఆయన అన్నారు. జగన్మోహన్ రెడ్డి పులివెందుల నుంచి కాకుండా మరొక చోటా పోటీ చేసే ధైర్యం ఉందా అంటూ ఆయన ప్రశ్నించారు. శ్రీకాళహస్తిలో జనసేన కార్యకర్త కొట్టే సాయి ని పోలీసు అధికారిణి కొడితే పవన్ కళ్యాణ్ సాయిని పరామర్శించి ఎస్పీతో కలిసి జనసేన శ్రేణులకు ధైర్యం కల్పించారని ఆయన చెప్పారు. సామాన్య కార్యకర్త అయిన సాయికి శ్రీకాళహస్తి దేవస్థానం ఛైర్మన్ పదవి ఇచ్చిన చరిత్ర పవన్ కళ్యాణ్ దని ఆయన తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఏ ఒక్క సామాన్య కార్యకర్తకు పదవి ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. ఐదేళ్ళ వైసిపి పాలనలో కాపు కార్పోరేషన్ ను నిర్వీర్యం చేశారని ఆయన చెప్పారు. కాపు భవనాల నిర్మాణం, కళ్యాణ మండపాల నిర్మాణాన్ని నిలిపివేసిన ఘనత వైసిపి దని ఆయన తెలిపారు. కాపు విద్యార్థులకు స్కాలర్ షిఫ్ లు వైసిపి ప్రభుత్వం ఇవ్వలేదని ఆయన గుర్తు చేశారు. సామర్లకోటలో కాపులకి రిజర్వేషన్ ఇచ్చేది లేదు అని జగన్ రెడ్డి ప్రకటించినప్పుడు వైసిపి కాపులు ఎందుకు ప్రశ్నించ లేదని ఆయన నిలదీశారు. మా ఊరికి రోడ్డు వేయండి అని అడిగిన వెంగయ్య అనే కాపు యువకుడిని ఆనాటి వైసీపీ ఎమ్మెల్యే బూతులు తిడితే ఆత్మహత్య చేసుకున్నప్పుడు వైసిపి కాపులు ఎక్కడ ఉన్నారని ఆయన ప్రశించారు. వైసిపి పాలనలో ఒకే కులం పదవులు పొందటమే కాకుండా దోచుకో దాచుకో లో కూడా ఒకే కులం భాగస్వామ్యమైందని ఆయన ఆరోపించారు. వైసిపి కాపు నాయకులు ఆ నాటి దోపిడిలో ఒక్కరైనా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. వైసిపిలోని కాపులు జగన్మోహన్ రెడ్డి చేసిన అరాచకాలు, దోపిడిని ప్రజలకు బహిరంగ పరచాలని ఆయన కోరారు. జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నించ లేని వైసిపి కాపులకు పవన్ కళ్యాణ్ ను విమర్శించే అర్హత లేదని ఆయన చెప్పారు. ఎన్డీఏ కూటమి కాపులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తమ్మినేని వెంకటేశ్వర రావు, ఆర్కాట్ కృష్ణప్రసాద్, అంకాలమ్మ ఆలయ పాలకమండలి ఛైర్మన్ కొండా రాజ్ మోహన్, రమేష్ నాయుడు, కెఎంకే లోకేష్, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, బాబ్జీ, రాజేష్ ఆచ్చారి, జేకే రాయల్, మణి పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శించిన సీఎస్ సాయిప్రసాద్ కుటుంబ

**విజయవాడ ఇంద్రకీలాద్రి జూన్ 22 ( ఆంధ్ర మనం )**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జి. సాయిప్రసాద్, ఐఏఎస్ సోమవారం సాయంత్రం కుటుంబ సమేతంగా ఇంద్ర కీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని ద ర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. మ్మవారి సన్నిధిలో సీఎస్ సాయిప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ వేదపండితులు ఆయనకు, కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం అందజేశారు. దర్శనానంతరం దేవస్థానం తరపున ఆలయ డిప్యూటీ ఈవో కిషోర్ కుమార్, ఏఈవో బి.వి. రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు ఏ. శ్రీనివాసరావు, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకరబాబు కలిసి సీఎస్‌కు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికగా అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దేవస్థానం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, అభివృద్ధి కార్యక్రమాల గురించి సీఎస్‌కు వివరించినట్లు తెలిపారు.

# మోడీ, యోగి ప్రభుత్వాల పహారా రామ మందిరంలో గజదొంగలు ఎవరు?

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్

**కడప ఆంధ్ర మనం :**



ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తి కి భక్తులు పరమ పవిత్రంగా సమర్పించిన సుమారు 200 కోట్ల రూపాయల నగదు, వజ్రవైఢూర్యాలు, విలువైన కానుకలను కాజేసిన దొంగలు ఎవరో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ,ఉత్తరప్రదేశ్ లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం వెంటనే బహిర్గతం చేసి దేశ ప్రజలకు తెలియజేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు. కడపలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అయోధ్యలో రామ మందిరం హుండీ ఆదాయ, వ్యయం లెక్కలలో వందల కోట్ల రూపాయల తేడా వచ్చినట్లు తీవ్ర దుమారం రేగిందన్నారు. ఈ భారీ దోపిడీ, దొంగతనం, మోసంపై యావత్ దేశంతో పాటుగా, రాములోరిభక్తులు తీవ్ర ఆవేదనకు గురయ్యారన్నారు. ప్రధానంగా భారతీయ జనతా పార్టీ జపించే హిందువులు కూడా తీవ్రంగా కలత చెందారన్నారు. సామాన్య భక్తుడు నుండి ధనవంతుల వరకు కోట్లాది రూపాయలు దేవుడికి కానుకగా సమర్పించారన్నారు. అంతేకాకుండా శ్రీరామచంద్రుడి మెడలో హారం ఇతర ఆభరణాలు కూడా మాయమైనట్లు ప్రచారం జరుగుతోందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలోని ప్రభుత్వం, ఉత్తర ప్రదేశ్ లో యోగి ప్రభుత్వాల పరిపాలనలో రామ మందిరంలో దొంగలు ఏ విధంగా పడ్డారన్న నిజాలను బయటపెట్టాలని భక్తులు కోరుతున్నారన్నారు. 1990వ సంవత్సరం నుండి ఇప్పటివరకు భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చేందుకు బాబ్రీ మసీదును విధ్వంసం చేసి, అక్కడ రామ మందిరాన్ని నిర్మించారన్నారు. అయితే ఆలయ పరిపాలన, నిర్వహణలో ట్రస్టు చైర్మన్ సంపత్ రాయ్, ఇతర ఉద్యోగుల ప్రమేయం పై విమర్శలు వస్తున్నాయన్నారు. కానీ వందల కోట్ల రూపాయల మేర ధనాన్ని లూటీ చేసిన బడా దొంగతనంలో పాలకులు ఉన్నారా, వారి ప్రమేయం ఉందా లేదా మతోన్మాదాన్ని తలకెత్తుకుని హిందువుల ప్రతినిధులుగా చలామణిఅవుతున్న ఆయా సంస్థల ప్రతినిధుల పాత్ర కీలకంగా ఉందా అనే కీలక వాస్తవాలు బిజెపి ప్రభుత్వాల ద్వారా వెలుగు చూడలేవన్నారు. కేంద్రంలోని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, తదితర కేంద్ర నేర పరిశోధన సంస్థలు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సుప్రీంకోర్టు ద్వారా న్యాయ విచారణ చేస్తే అసలు బండారం బయటపడుతుందని డిమాండ్ చేశారు. రామ మందిరంలో దొంగలు పడినట్లు, భక్తులు సమర్పించిన నగదు, అత్యంత ఖరీదైన కానుకలు దొంగతనం పై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడంపై దేశ ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్నారన్నారు. ఉత్తరప్రదేశ్ లోని బిజెపి ప్రభుత్వం నియమించిన సిట్ పై భక్తులు, ప్రజలకు నమ్మకం లేదన్నారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ 50 కోట్ల భూమి కొనుగోలు లావాదేవీలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. కానీ అక్కడ పనిచేసే ఉద్యోగులు, ఆలయ నిర్వాహకుల వెనుక ఈ భారీ దోపిడీలో ఎవరి ప్రమేయం ఉందన్న వాస్తవాన్ని ప్రజలకు వెంటనే తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. హిందూ మతం, హిందువులపై గుత్తాధిపత్యం చలాయించే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ , హిందూ ప్రచార సభ, ఇతర హిందూ సంస్థలు రామ మందిరంలో జరిగిన దోపిడీ, గజ దొంగతనం పై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ భారీ దొంగతనం, కుట్ర, దోపిడీని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ పలు సందేహాలు లేవనెత్తుతున్నా రన్నారు. ఆలస్యంగా వెలుగు చూసిన రామ మందిరంలో గజదొంగతనం లో బడా బాబుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఈ గజ దొంగతనంతో భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. రామ మందిరానికి పరమ పవిత్రంగా భక్తజనం సమర్పించిన కానుకులకు కూడా కూడా బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల పరిపాలనలో భద్రత కరువైందన్నారు. ఈ భారీ గజదొంగతనం ఇంటి దొంగల పనే అయినప్పుడు ఇంటి దొంగలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వ పెద్దలు ఎవరు అనే సత్యాన్ని ప్రజలకు తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. భారతీయ జనతా పార్టీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్పీ, కేవలం రాజకీయాలు చేస్తూ, హిందువులను మభ్యపెడుతూ వారి ఓట్ల ద్వారా అధికారం సాధించి మోసం చేస్తున్నారు. వారికి నిజమైన హిందూమత సంప్రదాయబద్ధమైన గుణం, ఆచరణ లేదన్నారు. హిందువులను ఓటు బ్యాంకుగా ఆర్ఎస్ఎస్ బిజెపి కలిపి వాడుకుంటున్నార న్నారు. అంతేగాని భక్తులు ఎంతో భక్తితో దేవుడికి సమర్పించే కానుకలను కైంకర్యం చేసే దొంగలను ప్రోత్సహిస్తున్నా ఉన్నారు. ఇది ఎంతవరకు సమంజసం మని భక్తకోటి ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు. హిందువులు ,హిందూ మతంపై భారతీయ జనతా పార్టీ, ఆర్ఎస్ఎస్ కు ఉన్న నిబద్ధత ఏమిటో రామమందిరం భారీ గజ దొంగతనం ద్వారా ప్రపంచానికి తెలిసిందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రతినిధులు ఎస్. హమీద్ , కమల్ భాష తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ ప్రమాదాలపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ జరిపించాలి

- హత్యా నేరం కింద కేసులు నమోదు చేయాలి .
- కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ధర్నా.

**విశాఖపట్నం, జూన్ 22, ఆంధ్ర మనం :**




విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదాలపై జ్యుడిషియల్ ఎంక్వయిరీ జరిపించాలని, హత్యా నేరం కింద కేసులు నమోదు చేయాలని, మరణించిన వారికి రూ. కోటి, క్షతగాత్రులకు రూ. 50 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్ టియు, పి ఓ డబ్ల్యు, ఎం.ఎన్.ఎస్ ఎస్,అరుణోదయ విశాఖ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి ఐఎఫ్ టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం,ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాల కారణంగా విశాఖ ఉక్కులో జరిగిన ప్రమాద మరణాలపై జ్యుడీషియల్ ఎంక్వయిరీని ఉన్నత స్థాయి నిపుణులైన అధికారులతో కలిపి సంయుక్తంగా జరిపించాలని, ప్రమాద కారణమైన వారిపై బిఎన్ఎస్ 105, 308,287,120బి నేరాల కింద కేసులు నమోదు చేయాలని మరణించిన వారికి కోటి రూపాయలు పరిహారం హ,క్షతగాత్రులకు 50 లక్షలు పరిహారం,బాధిత కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.భద్రతా ప్రమాణాలను దెబ్బతీసిన 4:లేబర్ కోడ్లను రద్దు చేయాలని,భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టే విధంగా పాత కార్మిక చట్టాలను సవరించాలని,సదరు ప్రమాదాలకు యాజమాన్యాలను సంబంధిత ప్రభుత్వ అధికారులను బాధ్యులుగా ఆ చట్టంలో పేర్కొనాలని కోరారు. విశాఖ జిల్లా పరిధిలోని స్టీల్ ప్లాంట్లో ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయన్నారు. ఈ నెల 8 న జరిగిన ప్రమాదంలో పదిమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారన్నారు.ఈ ప్రమాదానికి ముందు సంవత్సర కాలంలో మరో 20 మంది కార్మికులు కూడా ప్రాణాలు కోల్పోయారన్నారు.కానీ ఈ మరణాల పైన చట్టబద్ధమైన చర్యలు ఏమి తీసుకోవడం లేదని, కేవలం నామమాత్రపు పరిహారం చెల్లించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. కాబట్టి పైన పేర్కొన్న అంశాల పైన విచారణ చేపట్టడానికి హైకోర్టు సిట్టింగ్ జడ్జి, నిపుణులైనటువంటి అధికారులతో కూడిన సంయుక్త కమిటీతో ఎంక్వయిరీ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఎస్. వెంకటలక్ష్మి, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం నగర కన్వీనర్ ఈసర లక్ష్మి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు డి. ఏడుకొండలు,ఐఎఫ్ టియు,పిఓడబ్ల్యు, ఎం ఎన్ఎస్ఎస్, అరుణోదయ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు

## క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

- క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలి
- వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ శ్రీ ఎం వి ప్రణవ్ గోపాల్.

**విశాఖపట్నం జూన్ 22 ఆంధ్ర మనం.**




విశాఖ జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన విశాఖ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్–2026 పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి వి.ఎం.ఆర్.డి.ఎ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రోత్సాహం అందించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి కూడా దోహద పడతాయని, యువత క్రీడలను జీవన విధానంలో భాగంగా చేసుకోవాలని ఆయన అన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. క్రీడల అభివృద్ధికి వి.ఎం.ఆర్.డి.ఎ ప్రత్యేక నిధులు కేటాయించి ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎం.వి. ప్రణవ్ గోపాల్ అవార్డులు, బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన క్రీడాకారులు వివిధ విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఇలాంటి పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ పీలా శ్రీనివాస్, బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉష శ్రీ, 67వ వార్డు మాజీ కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడా ప్రముఖులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బీచ్ రోడ్ లో మద్యం అమ్మకాల జీవోను రద్దు చేయాలి

**మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా.**

**విశాఖపట్నం, జూన్ 22 ఆంధ్ర మనం.**



విశాఖపట్నం బీచ్ రోడ్ లో బీచ్ సాక్స్ పేరుతో మద్యం అమ్మకాలు జీవోనెం 362ను తక్షణమే రద్దు చేయాలని మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. గోవా తరహా సెక్స్ టూరిజాన్ని ఆపాలి.. బీచ్ సాక్స్, బీచ్ బెడ్స్ ఏర్పాటు వద్దు.. మద్యంతో పెరుగుతున్న నేరాలు ..అంటూ నినాదాలు చేశారు. డిమాండ్స్ తో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ అభిశక్త్ కిషోర్ కు ప్రతినిధులు అందజేశారు. ఈ వినతిని రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా పిఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. లక్ష్మి మాట్లాడుతూ విశాఖ బీచ్ ను గోవా తరహా బీచ్ గా మార్చడం దారుణం అన్నారు. అక్కడకు అమ్మాయిలను తరలించడం , హింసించడం ,చివరకు హత్యలు జరగటం పరిపాటిగా మారిందని చెప్పారు. గోవా బీచ్ కార్యక్రమాలకు వ్యతిరేకంగా అక్కడి ప్రజలు ఆందోళన చెందుతుంటే వైజాగ్ లో ఆ తరహా టూరిజం దేనికని ప్రశ్నించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. సావిత్రి మాట్లాడుతూ మత్తు పదార్థాలు ద్వారా ప్రభుత్వాలు ఆదాయాన్ని అర్జించకూడదని భారత రాజ్యాంగం చెబుతుంటే దాని వ్యతిరేకంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యు అధ్యక్షురాలు ఏ. విమల మాట్లాడుతూ గత ప్రభుత్వం సంవత్సరానికి రూ 30 వేల కోట్ల మద్యంపై సంపాదించింది కాబట్టి అంతకంటే ఎక్కువ ఆదాయం రాబట్టాలని కూటమి ప్రభుత్వం ఆలోచించడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం ప్రతినిధి డి .లలిత, మహిళా సంఘాల ప్రతినిధులు ఆర్.ఎస్. మాధవి, సత్యవతి, ఎస్ వెంకట లక్ష్మి, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ వినతుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్.
- వివిధ సమస్యలపై 313 వినతులు సమర్పించిన ప్రజలు

**విశాఖపట్నం, జూన్ 22, ఆంధ్ర మనం**



పీజీఆర్ఎస్ వేదికగా ప్రజల నుంచి వచ్చే వినతులకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకిరంచిన ఆయన ఈ మేరకు మాట్లాడారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని కలెక్టర్ స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు అందజేశారు. ప్రతి వినతిని అధికారులు సానుభూతితో పరిశీలించి నిర్దేశిత గడువులోపు పరిష్కారం అందించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జాప్యానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు సంతృప్తికరమైన పరిష్కారం అందించే దిశగా చర్యలు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

**వివిధ సమస్యలపై 313 వినతులు అందజేత**

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన పీజీఆర్ఎస్ కు ప్రజలు వివిధ సమస్యలపై మొత్తం 313 వినతులు సమర్పించారు. శాఖల వారీగా ప్రజలు సమర్పించిన వినతుల్లో రెవెన్యూ శాఖకు 17, జీవీఎంసీకి 74, పోలీసు శాఖకు 19, ఇతర శాఖలకు 203 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ తో పాటు, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆర్డీవో ఎం. విశ్వేశ్వరనాయుడు, ఏడీసీ సత్యవేణి, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి శేషశైలజ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అన్ని విభాగాల జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రయివేటు విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కోరిన ఏపీడబ్ల్యూజేఎఫ్

### సానుకూలంగా స్పందించి ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్

**తిరుపతి జూన్ 22 ఆంధ్ర మనం :**



తిరుపతి జిల్లాలోని ప్రయివేటు విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కల్పించాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్), ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ (ఏపీ బీజేఏ) సోమవారం జిల్లా కలెక్టర్ ను కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. దీనికి వెంటనే సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ జిల్లా విద్యాశాఖ అధికారికి ఫోన్ లో మాట్లాడి, ఈ మేరకు ఆదేశాలు పంపాలని తెలిపారు. వెంటనే ఆదేశాలు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. కాగా విన్నవించిన రెండు గంటల్లోనే జిల్లా విద్య శాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. కలెక్టర్ ను కలసిన వారిలో ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు గాజుల చెంగల రాయలు (గాంధీ – మనం), ఇంకా పానేటి చెంగలరాయలు (ఆంధ్ర మనం), శ్రీనివాస్ (ఆంధ్ర మనం), తిరుపతి ఫెడరేషన్ నాయకులు బాల సుబ్రహ్మణ్యం (ప్రజాశక్తి), కృష్ణ మూర్తి (ఆంధ్ర మనం), సుధీర్ (ప్రజాశక్తి) ఏపీబీజేఏ అధ్యక్షుడు దాచేపల్లి కిరణ్, సీనియర్ జర్నలిస్ట్ మోహన్ రావు ఉన్నారు. వెంటనే స్పందించి ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ ను జర్నలిస్టు నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

# 7 రోజుల్లో న్యాయం జరగాలి

### పోలీసు అధికారులకు అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు.

**అనకాపల్లి, జూన్ 22, ఆంధ్ర మనం :**



బాధితుల ముఖంలో నవ్వే పోలీసు వ్యవస్థకు అసలైన కొలమానమని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' ( పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి భారీగా బాధితులు తరలివచ్చారు. ఎస్పీ స్వయంగా బాధితులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సోమవారం వేదికలో మొత్తం 60 ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన 60 ఫిర్యాదులలో ఎక్కువగా ఈ క్రింది సమస్యలపైనే ప్రజలు ఆశ్రయించారు:

సివిల్ వివాదాలు: భూ తగాదాలు, ఆస్తి గొడవలు, ఆర్థిక మోసాలు.

**కుటుంబ సమస్యలు:** భార్యాభర్తల వేధింపులు, గృహ కలహాలు.

**ఇతరాలు:** శాంతిభద్రతలు మరియు పౌర సమస్యలు.

ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ, అక్కడికక్కడే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై గరిష్ఠంగా వారం రోజుల్లోపు విచారణ పూర్తి చేసి బాధితుడికి న్యాయం చేయాలి. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా, కేవలం నిజాల ఆధారంగా పారదర్శకంగా దర్యాప్తు జరగాలి. స్టేషన్‌లో కేసు ఏ దశలో ఉందో బాధితులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వారిలో నమ్మకం నింపాలి. విచారణ ముగిసిన వెంటనే తీసుకున్న చర్యలపై పూర్తి నివేదికను జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు . ముఖ్యంగా మహిళల రక్షణ, భద్రత విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదు. మహిళలను, సామాన్యులను మోసగించే వారిపై చట్టపరంగా ఉక్కుపాదం మోపుతాం. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి తమ సమస్యలను తెలియజేయవచ్చు. మీకు అండగా నిలవడానికి జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తుహిన్ సిన్హా తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, ఎస్సై శ్రీనివాస రావు, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

### ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి

**తిరుపతి, జూన్ 22 ఆంధ్ర మనం :**



ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంస్థ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి సూచించారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి 'డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా సంస్థ పరిధిలోని 9 జిల్లాల నుంచి 54 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను సీఎండీకి వివరించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ 'డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి' కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యల్ని పరిష్కరించేందుకు సంస్థ అధికారులు, సిబ్బంది ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం, ఏపీఎస్పీడీసీఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ & హెచ్ఆర్ డి) కే. గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణా దేవి, ఎం. మురళి కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, ఎం. ఉమాపతి, సిహెచ్ రామచంద్ర రావు, కే. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు చక్రపాణి, జగదీష్, లత, తదితరులు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజ పరిరక్షణకు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

- జూన్ 28 నుంచి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- డయేరియా, డెంగ్యూ, మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**నంద్యాల, జూన్ 22 ఆంధ్ర మనం**

దేశంలో పోలియో వ్యాధి పూర్తిగా నిర్మూలన సాధించినప్పటికీ, పొరుగు దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో వ్యాధి తిరిగి వ్యాపించకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల స్వీకరణ అనంతరం పల్స్ పోలియో కార్యక్రమం, డయేరియా నివారణ చర్యలు, వర్షాకాలంలో తలెత్తే అంటువ్యాధుల నియంత్రణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ డిఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో వంద శాతం విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం దేశం పోలియో రహితంగా ఉన్నప్పటికీ ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, నైజీరియా వంటి దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్నందున ప్రతి సంవత్సరం ప్రత్యేక రక్షణ చర్యగా పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 28వ తేదీ ఆదివారం మొదటి రోజు పోలియో బూత్‌ల ద్వారా పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నామని, అదే రోజున 90 నుంచి 95 శాతం మంది పిల్లలను కవర్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. అనంతరం జూన్ 29, 30 తేదీలలో ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు అందజేస్తామని కలెకర్ తెలిపారు. జిల్లాలో జననం నుండి ఐదేళ్లలోపు వయస్సు కలిగిన ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమం కోసం దాదాపు మూడు లక్షల వ్యాక్సిన్ డోసులను సిద్ధం చేసి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేస్తున్నామని, వ్యాక్సిన్ నాణ్యత దెబ్బతినకుండా కోల్డ్ చైన్ వ్యవస్థను పటిష్ఠంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1320 పోలియో బూత్‌లు, 44 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 4 వేల మంది సిబ్బందికి శిక్షణ అందించామని, వలస కూలీలు నివసించే ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రదేశాలు, ఫ్యాక్టరీలు, పట్టణ మురికివాడలను ప్రత్యేకంగా గుర్తించి అక్కడ పిల్లలు ఎవరూ మిస్ కాకుండా మొబైల్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికుల పిల్లలకు కూడా పోలియో చుక్కలు అందించాలని అధికారులను ఆదేశించారు.

# జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమం

- జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి.
- 0-5 ఏళ్ల లోపు పిల్లలందరికీ చుక్కలు వేయడమే లక్ష్యం

**పార్వతీపురం, జూన్ 22, ఆంధ్ర మనం :**



జిల్లాలో జూన్ 28న నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో నూతన ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వంద శాతం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ చైర్మన్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పల్స్ పోలియో ముందస్తు ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 5 ఏళ్ల లోపు వయస్సు గల పిల్లలు ఎవరూ వదలకుండా పోలియో చుక్కలు వేయించడమే మన లక్ష్యం కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా జూన్ 28న బూత్‌లలో పోలియో చుక్కలు వేస్తారని, మిగిలిపోయిన వారికి జూన్ 29, 30 తేదీలలో ఇళ్లకు వెళ్లి చుక్కలు వేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మండల టాస్క్ ఫోర్స్ సమావేశాలు నిర్వహించి, విద్యాశాఖ సిబ్బంది సహకారంతో 0–5 ఏళ్ల పిల్లలను గుర్తించి బూత్‌లకు వచ్చేలా సన్నద్ధం చేయాలని జడ్పీ సీఈఓ, ఎంపీడీఓ లను ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు బూత్ మరియు గృహ సందర్శన కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనాలని ఐసీడీఎస్ పీడీకి సూచించారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు జూన్ 24 నుండి 30 వరకు జిల్లా వ్యాప్తంగా అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించాలని విద్యుత్ శాఖ అధికారులను, పాఠశాలలను పోలియో బూత్‌ల ఏర్పాటుకు సిద్ధం చేయడంతో పాటు టీచర్లను విధుల్లో భాగస్వామ్యం చేయాలని, ఐదు రోజుల ముందు నుంచే పాఠశాలల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని విద్యా శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మరియు సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని డీపీఆర్ఓను, పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామాలలోని ప్రభుత్వ గోడలపై వ్రాతలు,చాటింపుల ద్వారా ప్రచారం నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారికి ఆదేశాలు జారీచేశారు.ఆర్టీసీ, రైల్వే స్టేషన్లలో సంచార (ట్రాన్సిట్) బూత్‌లను ఏర్పాటు చేసి ప్రయాణంలో ఉన్న పిల్లలకు చుక్కలు వేయాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు (రోటరీ, లయన్స్ క్లబ్) కూడా ఈ బూత్ సిబ్బందికి తమ వంతు సహకారం అందించాలన్నారు. ఈ వీడియో సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పై అప్రమత్తంగా ఉండాలి పారదర్శకత లేకుంటే ప్రజాస్వామ్య వ్యవస్థలకే ముప్పు:

### పరకాల ప్రభాకర్ విశాలాంధ్ర ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు: గుజ్జుల ఈశ్వరయ్య

**విజయవాడ జూన్ 22 ( ఆంధ్ర మనం**




ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ రాజకీయ, ఆర్థికవేత్త, రచయిత పరకాల ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఓటు హక్కుపై జరిగే ఏ దాడినైనా ప్రజాస్వామ్య బద్ధంగా తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ పూర్తిస్థాయి పారదర్శకత, జవాబుదారీతనం, స్వతంత్ర పర్యవేక్షణతో జరగాలని సూచించారు.విజయవాడ గాంధీనగర్‌లోని రామా ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన విశాలాంధ్ర దినపత్రిక 74వ వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 'ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) – ఆంతర్యం, సవాళ్లు' అంశంపై ప్రసంగించారు. ఎస్ఐఆర్, నియోజకవర్గాల పునర్విభజన, భౌగోళిక మార్పులపై ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ అమలు నేపథ్యంలో భారీ స్థాయిలో ఓట్ల తొలగింపుపై వ్యక్తమైన సందేహాలు, ఆందోళనలను ఆయన ప్రస్తావించారు. 2002లో జరిగిన ఎస్ఐఆర్ సమయంలో ఓటర్లు తమ అర్హతను నిరూపించేందుకు పత్రాలు సమర్పించాల్సిన అవసరం రాలేదని, ప్రస్తుతం పౌరులే తమ ఓటు హక్కును రుజువు చేసుకోవాల్సిన పరిస్థితి తీసుకురావడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు.ఎస్ఎస్ఆర్ సంతృప్తికరంగా జరగలేదన్న కారణంతో ఎస్ఐఆర్ చేపట్టామని ఎన్నికల సంఘం చెబుతున్నప్పటికీ, సమాచార హక్కు చట్టం కింద కోరిన వివరాలకు తగిన అధ్యయన నివేదికను అందించలేదని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ నిర్వహించాలని నిర్ణయం ఎవరు తీసుకున్నారనే ప్రశ్నకు కూడా ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని తెలిపారు.బీహార్‌లో ఎస్ఐఆర్ అనంతరం సుమారు 63 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించబడినట్లు వివాదాలు చెలరేగినా, ఎన్నికల సంఘం సమీక్ష నిర్వహించలేదన్నారు. మైనార్టీలు, దళితులు, ఆదివాసీలు, పేదలు, మహిళలే ఎక్కువగా ఈ ప్రక్రియ ప్రభావానికి గురవుతున్నట్లు వివిధ అధ్యయనాలు సూచిస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే అనేక రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ అమలైందని, సుమారు 6.5 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించబడినట్లు అంచనాలు ఉన్నాయని, ఇదే విధానం కొనసాగితే ఈ సంఖ్య 16.5 కోట్లకు చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎస్ఐఆర్ ప్రభావం కేవలం ఎన్నికల ఫలితాలకే పరిమితం కాదని, భవిష్యత్తులో ఓటు హక్కు కలిగినవారు, కోల్పోయినవారు అనే రెండు వర్గాల పౌరులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రాథమిక హక్కు అని, ఓటరు జాబితాల సవరణలో ప్రజల విశ్వాసాన్ని కాపాడటం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశాలాంధ్ర ఎడిటోరియల్ బోర్డు చైర్మన్ గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ విశాలాంధ్ర ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఏడాది పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్‌పై సభలు, సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేస్తామని తెలిపారు.

# ఘనంగా టిడిపి మాజీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం (జగన్) జన్మదిన వేడుకలు

### ముఖ్య అతిథులుగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు.

**గాజువాక జూన్ 22, ఆంధ్ర మనం.**



గాజువాక నియోజకవర్గం 87వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో సోమవారం టిడిపి మాజీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్) జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక నియోజకవర్గం శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం పార్టీ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథి ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ అహర్నిశలు ప్రజల కోసం ఆలోచిస్తూ వార్డ్ అభివృద్దే తన ధ్యేయంగా సుమారు 40 కోట్ల రూపాయలు జీవిఎంసి నిధులు మంజూరు చేయించి వార్డ్ అభివృద్ధిలో జగన్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అందులో భాగంగా 83 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని జగన్ ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో జరుపుకోవాలని ఎన్నో పదవులు అధిరోహించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలు, ఇల్లపు ప్రసాదు , 87వ వార్డు అధ్యక్షులు విజయరామరాజు, సెక్రటరీ బొట్టా ప్రకాష్, రాజన్ రాజ్ , కర్రీ కన్నారావు, డీవీ అప్పారావు, ప్రగడ దానయ్య, రమణమూర్తి, కె. శ్రీనివాస్ నాయుడు, దానయ్య ద్రోణాద్రి అప్పలనాయుడు, ఆనంద్ కుమార్, వై.భాస్కరరావు పోతుల కృష్ణ, మల్లా రాము, కనక సత్యం, ఆదినారాయణ, జాన్ రమేష్, కళ్యాణ్ చక్రవర్తి, వై నాగేశ్వరరావు సిద్ధార్థ నగర్ అసోసియేషన్ సభ్యులు, తిరుమల నగర్ అసోసియేషన్ సభ్యులు, గణేష్ నగర్ అసోసియేషన్ సభ్యులు, నియోజకవర్గం సభ్యులు, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆంధ్ర మనం

మంగళవారం జూన్ 23 2026

## జర్నలిస్టు కుటుంబాలకు విద్యా భరోసా

### జీవో జారీ చేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల జూన్ 22, ఆంధ్ర మనం.**

జిల్లాలోని అక్రిడియేటెడ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డికి ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు నిత్యం కృషి చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన, మధ్యతరగతి జర్నలిస్టు కుటుంబాలకు ఈ ఫీజు రాయితీ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన అక్రిడియేటెడ్ జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పాఠశాల యాజమాన్యాలు ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ నిర్ణయం జర్నలిస్టు వర్గాల్లో హర్షాతిరేకాలకు దారితీసింది.

## సైకిల్ పై జిల్లా పరిషత్ కు చేరుకున్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్

**శ్రీకాకుళం,జూన్,22 ఆంధ్ర మనం:**

జిల్లా పరిషత్ లో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కు, పాత సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ లకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ లు సైకిల్ పై చేరుకున్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు, ఇంధన పొదుపునకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతోనే జిల్లా ఉన్నతాధికారులు ఇలా సైకిల్ పై ప్రయాణించడం విశేషం. వారి వారి కార్యాలయాల నుండి జిల్లా పరిషత్ కు సైకిల్ పై నేరుగా చేరుకున్నారు. పిజిఆర్ఎస్ అనంతరం తిరిగి వారి క్యాంపు కార్యాలయాలకు చేరుకున్నారు.

## మోదీ యుగంలో భారత ప్రగతిని ప్రతిబింబించే గ్రంథం

### చంద్రబాబుకు 'భారత్ రైజింగ్ ఇన్ ది మోదీ ఎరా' పుస్తకం బహూకరణ

**అమరావతి జూన్ 22 ( ఆంధ్ర మనం)**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం సాధించిన అభివృద్ధి, పరివర్తన, ప్రపంచ వేదికపై దేశ ప్రతిష్ఠ పెరుగుదలను ప్రతిబింబించే 'భారత్ రైజింగ్ ఇన్ ది మోదీ ఎరా' పుస్తకాన్ని ప్రముఖ రచయిత, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి డాక్టర్ కిలారి దిలీప్ సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మర్యాదపూర్వకంగా బహూకరించారు.ఈ సందర్భంగా పుస్తకాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రచయితను అభినందించారు. మోదీ నాయకత్వంలో దేశం సాధించిన ప్రగతి, ప్రపంచ నాయకత్వ దిశగా భారత్ వేస్తున్న అడుగులు, వివిధ రంగాల్లో నమోదైన మార్పులు, విజయాలను ఈ గ్రంథం విశ్లేషణాత్మకంగా ఆవిష్కరించిందని పేర్కొన్నారు.భారతదేశ అభివృద్ధి ప్రయాణాన్ని అర్థం చేసుకోవాలనుకునే పాఠకులకు ఈ పుస్తకం ఉపయోగకరమైన మార్గదర్శిగా నిలుస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు. రచయిత కిలారి దిలీప్ మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వ హయాంలో దేశంలో చోటుచేసుకున్న సాంకేతిక ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాల విస్తరణ, ఆర్థిక సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు, అంతర్జాతీయ వేదికలపై భారత ప్రతిష్ఠ పెరుగుదల వంటి కీలక అంశాలను గ్రంథంలో సమగ్రంగా పొందుపరిచినట్లు తెలిపారు.

## పవన్ హోదాకు తగినట్లు మాట్లాడాలి: బండి పుణ్యశీల



**విజయవాడ జూన్ 22 ( ఆంధ్ర మనం) :** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హోదాకు తగిన విధంగా వ్యవహరించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండి పుణ్యశీల సూచించారు. ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.పవన్ కళ్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని విమర్శించారు. రాజకీయ నాయకుడిగా, ఉప ముఖ్యమంత్రిగా హుందాగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో కుల ప్రాతిపదికన ఓట్లు కోరిన పవన్ కళ్యాణ్, ఇప్పుడు అదే కులాన్ని తక్కువ చేసి మాట్లాడటం విరుద్ధ ధోరణిగా కనిపిస్తోందని పేర్కొన్నారు.సీఐ వేధింపుల కారణంగా మృతి చెందిన సాయికృష్ణ కుటుంబాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించడాన్ని కూడా రాజకీయ కోణంలో చూడటం సరికాదన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన చర్యలపై అధికార పక్షం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.పవన్ కళ్యాణ్ మాటల్లో స్థిరత్వం లేదని, జనసేన కార్యకర్తల ఆశయాలను గత 15 ఏళ్లుగా టీడీపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో రౌడీయిజం, గూండాయిజంపై మాట్లాడే ముందు అధికార పక్షం తన వైఖరిని సమీక్షించుకోవాలని సూచించారు.పవన్ కళ్యాణ్ అభిమానులే ప్రస్తుతం ఆయన వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని బండి పుణ్యశీల వ్యాఖ్యానించారు. అలాగే మహిళలకు జరిగిన అన్యాయాల విషయంలో కూడా పవన్ కళ్యాణ్ స్పందన ప్రశ్నార్థకంగా ఉందని విమర్శించారు. రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు కాకుండా ప్రజా సమస్యలపై చర్చ జరగాలని ఆమె కోరారు.

## ప్రజా దర్బార్ కి 8 వినతులు

**విశాఖపట్నం, జూన్ 22 ఆంధ్ర మనం.**

వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్ లో వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ పాల్గొని బాధితుల నుంచి వినతులు అందుకున్నారు. అర్జీలను పరిశీలించి, బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఒక సమస్య పై ఎక్కువ సార్లు కార్యాలయాల చుట్టూ తిరగకుండా చూడాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా బాధితులకు సమాచారం అందించాలని సూచించారు. ప్లానింగ్ విభాగానికి చెందిన వినతులను పరిశీలించి, బాధితులకు వివరణ ఇవ్వాలని సూచించారు. ప్రజా దర్బార్ కి మొత్తం 8 వినతులు రాగా వాటిలో ప్లానింగ్ -3, ఎస్టేట్ -1, అలాట్మెంట్ -2, ఇంజనీరింగ్,-2 చొప్పున వినతులు వచ్చాయి. సమావేశంలో కార్యదర్శి మురళీ కృష్ణ, ఓ ఎస్ డి కృష్ణ నాయక్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెదగంట్యాడ నుంచి గంగవరం వెళ్లే ప్రధాన రహదారి పనులు ముమ్మరం

### పర్యవేక్షణ చేసిన జనసేన నేత చోడిపిల్లి ముసలయ్య.

**పెదగంట్యాడ, జూన్ 22, ఆంధ్ర మనం.**




గాజువాక నియోజకవర్గ శాసనసభ్యులు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మరియు మహావిశాఖ నగర మాజీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి కృషితో పెదగంట్యాడ నుంచి గంగవరం వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణం ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ మేరకు నిర్మాణం కోసం ఎమ్మెల్యే పల్లా జీవీఎంసీ నిధులను మంజూరు చేయించారు. 64 వార్డు గంగవరం గ్రామంలోని గంగవరం నుంచి పెదగంట్యాడ రహదారి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనులను 64వ వార్డు జనసేన ప్రెసిడెంట్, విశాఖ జిల్లా మాజీ పార్లమెంట్ అధికార ప్రతినిధి చోడిపిల్లి ముసలయ్య దగ్గరుండి పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తి అయితే పెదగంట్యాడ నుంచి గంగవరం మత్స్యకార గ్రామాలకు రాకపోకలు సాధించేందుకు వాహనదారులు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఈ సందర్భంగా చోడిపిల్లి ముసలయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతం నుంచి గంగవరం మీదుగా యారాడ బీచ్ కు పర్యాటకులు రాకపోకలు సాధించేందుకు మరింత సౌకర్యంగా ఉంటుందన్నారు.

## పెదగంట్యాడ పాఠశాలను ప్రభుత్వ పరంగా నడిపించాలి

### జిల్లా కలెక్టర్ ను కోరిన మొల్లి పెంటిరాజు.

**పెదగంట్యాడ, జూన్ 22, ఆంధ్ర మనం**

విశాఖ విమల విద్యాలయం బి సి రోడ్, పెదగంట్యాడ పాఠశాలను కూడా ప్రభుత్వపరంగా నడిపించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులతో కలిసి, విశాఖ జిల్లా కలెక్టర్ అభిషక్త్ కిషోర్ ని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా తెలుగుయువత ప్రధానకార్యదర్శి, డైరెక్టర్ – ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మొల్లి పెంటిరాజు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు గత 40 ఏళ్లుగా విశాఖ స్టీల్ ప్లాంట్ ఆధ్వర్యంలో నడుస్తున్న విశాఖ విమల విద్యాలయం, బి సి రోడ్, పెదగంట్యాడ పాఠశాలను కూడా స్టీల్ యాజమాన్యం వచ్చే ఏడాది నుంచి నిలిపివేయాలని నిర్ణయం తీసుకోవడంతో, పాఠశాల ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు గతంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల విశాఖ విమల విద్యాలయం ఉక్కునగరం పాఠశాలను, విద్యాశాఖ మంత్రి లోకేష్, ఎంపీ శ్రీ భరత్ సహకారంతో, ఏ విధంగా ప్రభుత్వ పాఠశాలగా నడిపించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూములిచ్చిన నిర్వాసిత ప్రజల కోసం, కాంట్రాక్ట్ కార్మికుల పిల్లల కోసం, ప్రధాన నిర్వాసిత కాలనీలైన ప్రాంతానికి చెందిన విశాఖ విమల విద్యాలయం – పెదగంట్యాడ పాఠశాలను కూడా ప్రభుత్వపరంగా నడిపించేందుకు చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నిర్వాసిత ప్రజలు కోరారన్నారు. విశాఖ విమల విద్యాలయం ఉక్కునగరం పాఠశాలను ప్రభుత్వ పరంగా నడుస్తుందని తెలిసిన వెంటనే, కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని, రాష్ట్ర విద్యా శాఖ నారా లోకేష్ దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకువెళ్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు . కూటమి ప్రభుత్వం తప్పకుండా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకొని నడుస్తుందని , ప్రజాభిప్రాయంకు మేరకే నడుచుకుంటామని అన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్ అభిషక్త్ కిషోర్ వినతిపత్రం తీసుకుని తప్పకుండా ప్రభుత్వ పరంగా సంబంధిత అధికారులు, నాయకులు దృష్టి కి తీసుకొనేవెళ్ళి, సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్య ప్రతాప్, మధు నాయుడు, లత, సుగుణామని, పూర్వ విద్యార్థులు రజిని, కోన రమణ, శ్రీను, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



## పల్నాడు శ్రీ మహాశైవక్షేత్రం నాయకురాలు నాగమ్మ ప్రాంగణం

- దేవాలయాల శంకుస్థాపన , సేవా కార్యక్రమాల అభివృద్ధి పనులకు అంకురార్పణ ఆహ్వానం
- టీటీడీ పాలక మండలి సభ్యులు

**జంగా కృష్ణమూర్తి**

**పిడుగురాళ్ల జూన్ 22 ఆంధ్ర మనం :**



పిడుగురాళ్ల పట్టణంలో ఆర్ అండ్ బి బంగ్లా నందు మాజీ శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి, కూటమి నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా టీటీడీ పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. గురజాల నియోజకవర్గం , దాచేపల్లి మండలం, గామాలపాడు గ్రామం నందు జూలై 4వ తేదీన శనివారం ఉదయం 10 గంటలకు దేవాలయాల శంకుస్థాపనకు, సేవా కార్యక్రమాల అభివృద్ధి పనులకు అంకురార్పణ .. ఆహ్వాన పత్రాన్ని పిడుగురాళ్ల పట్టణ టీడీపీ పట్టణ అధ్యక్షులు పిల్లి చెన్నారావు కి , పిడుగురాళ్ల పట్టణ ఆర్యవైశ్య నాయకులు రాష్ట్ర టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు కనిగిరి శ్రీనివాసరావు కి, పల్నాడు జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అమీర్ అలీ కి పట్టణంలోని ఆర్ అండ్ బి బంగాళా నందు సోమవారం అందించిన టీటీడీ పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11వ శతాబ్దంలో గామాలపాడు గ్రామంలో నాగులేరు తీరాన నాయకురాలు నాగమ్మ చిన్న మల్లికార్జున స్వామి దేవాలయం, పలు ఉపాలయాలు నిర్మించారు. శిధిలావస్థలో ఉన్న ఈ ఆలయాల పునరుద్ధరణ లో భాగంగా గత ఏడాది మరకత లింగంతో పాలం ప్రతిష్ట చేసి నిత్య పూజా కైంకర్యాలు ప్రారంభించడం జరిగింది. ప్రతిరోజు ఉషోదయాన సూర్యకిరణాలు శివలింగంపై ప్రసరించటం ఇక్కడ విశిష్టత. ఈ ప్రాంగణంలో మహా సైవక్షేత్రంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా జులై 4వ తేదీన శనివారం ఉదయం గం "10:08 నిమిషములకు ధనిష్ట నక్షత్ర యొక్క సింహ లగ్న పుష్కరాంశము నందు వివిధ దేవాలయాల శంకుస్థాపన, దేవతామూర్తుల ప్రతిష్ట కార్యక్రమములు, అభివృద్ధి పనుల్లో శ్రీకరానికి వేద పండితులు శుభసంకల్పం గావించినారు. శ్రీ పార్వతీ సమేత చర్ల మల్లికార్జున స్వామి ఆలయ జీవధ్వజ ప్రతిష్టాపన. తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహకారంతో శ్రీ శ్రీ శ్రీ రాజరాజేశ్వరి సమేత మహారాజా రాజేశ్వర స్వామి వారి ఆలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ శంకుస్థాపనలు. నూతనంగా నిర్మించిన ఉపాలయాలలో శ్రీ విఘ్నేశ్వర స్వామి. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి విగ్రహాల ప్రతిష్టాపన. గోశాల, వృద్ధాశ్రమం, అనాధాశ్రమం, కళ్యాణ మండపం నిర్మాణాలకు అంకురార్పణ జరుగును ఈ కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి అనేక మంది ప్రముఖులు వచ్చేస్తున్నారు. కావున యావన్మంది ఈ కార్యక్రమాలలో పాల్గొని భగవంతుని అనుగ్రహ ఆశీర్వాదములను, అన్న ప్రసాదాలను స్వీకరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సానుకూలత పెరగాలి- స్థానం మెరుగుపడాలి

- అట్టడగు స్థానాల్లో ఉన్నవారికి షోకాజ్ నోటీసులు
- జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి.

**విజయనగరం, జూన్ 22, ఆంధ్ర మనం ::**



ప్రభుత్వం అందిస్తున్న సేవల పట్ల ప్రజా సానుకూలతను పెంచాలని, అదేవిధంగా జిల్లా ర్యాంకును మెరుగుపర్చేందుకు కృషి చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం, ఐవిఆర్ఎస్ కాల్స్, ప్రభుత్వ పథకాల అమల్లో ప్రజా సానుకూలత, ఎలక్షన్ ఫారాల పంపిణీ తదితర అంశాలపై కలెక్టరేట్‌లో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సానుకూలత విషయంలో వెనుకబడ్డ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడం, సమీక్షలు నిర్వహించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఆయా శాఖలు అందిస్తున్న సేవల్లో అట్టడుగు స్థానాల్లో ఉన్న మండలాలు, క్షేత్రస్థాయి అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు. పిజిఆర్ఎస్ ధరఖాస్తులకు సంబంధించి ఎట్టిపరిస్థితిలోనూ నిర్ణీత గడువు దాటకూడదని స్పష్టం చేశారు. ఐవిఆర్ఎస్ సర్వేలో అంతగా సానుకూలత వ్యక్తం కాని ప్రభుత్వ శాఖలపై కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రజల్లో అవగాహనా లోపం వల్ల కూడా ఒక్కోసారి తప్పుడు సమాధానం ఇవ్వడం జరుగుతుందని, అందువల్ల అవగాహన పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజల సంతృప్త స్థాయిని పెంచడంపై ఆయా శాఖల ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ కోరారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు, ఆన్‌లైన్ ద్వారా ఆర్‌డిఓలు, తాహసీల్దార్లు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.


## తెలుగు మా వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన నటుడు సత్య ప్రకాష్

**విశాఖపట్నం జూన్ 22 ఆంధ్ర మనం.**

"తెలుగు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (తెలుగు మా)" 3వ వార్షికోత్సవ పోస్టర్ ను ప్రముఖ నటుడు, దర్శకుడు, సత్య ప్రకాష్ నగరంలోని మేఘాలయ హోటల్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భవిష్యత్ లో అసోసియేషన్ కళాకారుల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమ వివరాలను తెలుగు మా అసోసియేషన్, ఉపాధ్యక్షుడు, ఉత్తరాంధ్ర జిల్లాల ఇంచార్జ్, ఎం.కృష్ణ కిషోర్ నటుడు సత్య ప్రకాష్ కు వివరించారు. రాష్ట్రంలో కళాకారుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికై "తెలుగు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్" ఆంధ్రప్రదేశ్) లో ఏర్పాటు చేయడం అభినందనీయమని నటుడు సత్య ప్రకాష్ కొనియాడారు. కళాకారుల సంక్షేమానికి తన సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన తెలిపారు. తెలుగు–మా అసోసియేషన్ (ఆంధ్రప్రదేశ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, డా.పూతి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27న విజయవాడ, గవర్నర్ పేట, రాఘవయ్య పార్క్ ఎదురుగా బాలోత్సవ భవన్ వేదికగా సాయంత్రం నాలుగు గంటల నుంచి ఎనిమిది వరకు "తెలుగు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (ఆంధ్రప్రదేశ్) 3వ వార్షికోత్సవం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మరిన్ని వివరాలకు 9949114919, 7981722023, 7330949072, 8985566770, 8555919166, 9100775857, 9346717615 నంబర్లకు సంప్రదించాలని అధ్యక్షుడు, డా.పూతి వెంకటరెడ్డి కోరారు, కార్యక్రమంలో కార్య నిర్వాహక కార్యదర్శి, వై.రాజ శేఖర్, అసోసియేషన్ ప్రతినిధులు ఈశ్వర్, రాజు, శేఖర్, సాయి సంతోష్ పాల్గొన్నారు.



# విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌పై స్పష్టత



**న్యూఢిల్లీ, జూన్ 22:** భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌పై వస్తున్న రీఎంట్రీ ఊహాగానాలకు పూర్తి తెరదించాడు. టెస్ట్ ఫార్మాట్‌లో తిరిగి ఆడే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశాడు. న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కోహ్లీని టెస్ట్ క్రికెట్‌కు మళ్లీ వచ్చే ఆలోచన ఉందా అని ప్రశ్నించగా, తాను ఆ ఫార్మాట్‌కు పూర్తిగా వీడ్కోలు పలికానని, ఇక తిరిగి రానని తేల్చి చెప్పాడు. ఇది గతమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఐపీఎల్ సందర్భంగా గాయపడిన కోహ్లీ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ గాయం కారణంగా ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు కూడా ఆయన దూరమయ్యాడు. త్వరలో బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ టెస్ట్‌కు హాజరుకానున్నట్లు సమాచారం.

### టెస్ట్ కెరీర్ విశేషాలు

కోహ్లీ తన 14 ఏళ్ల టెస్ట్ కెరీర్‌లో 123 మ్యాచ్‌లు ఆడి 9,230 పరుగులు సాధించాడు. ఇందులో 30 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అతని అత్యధిక స్కోర్ 254 నాటౌట్. భారత టెస్ట్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఆయన నాలుగో స్థానంలో నిలిచాడు. టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన తర్వాత కూడా కోహ్లీ వన్డేలు, టీ20ల్లో కొనసాగుతున్నాడు.

# ఈజిప్ట్‌కు చరిత్రాత్మక విజయం

**న్యూయార్క్, జూన్ 22:** ఫిఫా వరల్డ్ కప్‌లో ఈజిప్ట్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 3-1 గోల్స్ తేడాతో గెలిచి అభిమానులను ఆనందంలో ముంచెత్తింది. మ్యాచ్ ప్రారంభంలో ఆధిక్యం న్యూజిలాండ్‌కే దక్కింది. 15వ నిమిషంలో ఫిన్ సుర్మన్ గోల్ చేసి జట్టుకు లీడ్ అందించాడు. కానీ రెండో అర్ధభాగంలో ఈజిప్ట్ ఆటగాళ్లు అద్భుతంగా పుంజుకున్నారు. కేవలం 24 నిమిషాల వ్యవధిలో మూడు గోల్స్ చేసి మ్యాచ్‌ను పూర్తిగా తమ వైపు తిప్పుకున్నారు. ఈ విజయంతో ఈజిప్ట్ గ్రూప్ జీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. ఈజిప్ట్ స్టార్ ప్లేయర్ మొహమ్మద్ సలాహ్ ఈ మ్యాచ్‌లో కీలక పాత్ర పోషించాడు. ఒక గోల్ చేయడంతో పాటు మరో గోల్‌కు అసిస్ట్ అందించి జట్టు విజయానికి ప్రధాన కారణమయ్యాడు. ఈజిప్ట్ నాలుగోసారి వరల్డ్ కప్‌లో పాల్గొంటుండగా, 1934 తర్వాత తొలిసారి ఈ స్థాయిలో విజయం నమోదు చేయడం విశేషంగా మారింది. తదుపరి మ్యాచ్‌లో ఇరాన్‌తో గెలిస్తే నాకౌట్ దశకు చేరే అవకాశం ఉంది.



# ప్రేక్షకుల దృక్కోణం మారింది

## అందుకే జాగ్రత్తలు తీసుకుంటున్నా: సాయిదుర్గా తేజ్

సాయి దుర్గా తేజ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్.కె.పి దర్శకత్వంలో రానుంది. ఈ సినిమా విడుదల ఆలస్యం కావడంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. తాజాగా ఈ ఆలస్యంపై సాయి దుర్గా తేజ్ స్పందించారు. సినిమాల ఎంపికలో తాను ఎందుకు ఇంత సమయం అవసరమవుతోందో వివరించారు. ప్రస్తుతం ప్రేక్షకులు ఓటీటీల్లో ఎన్నో సినిమాలు, వెబ్‌సిరీస్‌లు వీక్షిస్తున్నట్లు తెలిపారు. అన్ని జానర్‌లలోని కంటెంట్ గురించి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నట్లు చెప్పారు. ప్రేక్షకుల ఆలోచనల్లో మార్పు వచ్చిందని అందుకే తన సినిమాల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాళ్లను మెప్పించాలంటే కథల ఎంపికలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించక తప్పదన్నారు. అందుకే కాస్త సమయం పడుతోందని స్పష్టం చేశారు. ఈ సినిమా కోసం తన సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా శ్రమిస్తున్నట్లు గతంలో సాయి దుర్గా తేజ్ తెలిపారు. దర్శకుడు రోహిత్ విజన్ అందరికీ నచ్చేలా ఉంటుందన్నారు. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా తన కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుందని చెప్పారు.





# చిన్న పాత్రలతో ప్రారంభమై స్టార్‌గా ఎదిగిన సాయి ధన్సిక

సినీ పరిశ్రమలో అనేక మంది నటీనటులు చిన్న చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించి, సంవత్సరాల కృషి తర్వాత ప్రధాన పాత్రల్లో స్థిరపడిన ఉదాహరణలు ఉన్నాయి. హీరోలు మాత్రమే కాకుండా హీరోయిన్లు కూడా ఇలాంటి కష్టతరమైన ప్రయాణం ద్వారా స్టార్ స్థాయికి చేరుకున్న సందర్భాలు ఎన్నో కనిపిస్తాయి. ప్రారంభంలో సైడ్ ఆర్టిస్టులు లేదా డాన్సర్లుగా పనిచేసిన వారు కూడా తర్వాత కాలంలో ప్రముఖ నటీనటులుగా ఎదిగారు. ఈ క్రమంలో త్రిష, కాజల్ అగర్వాల్ వంటి స్టార్ హీరోయిన్లు కూడా కెరీర్ ప్రారంభంలో చిన్న పాత్రల్లో నటించి, ఆ తర్వాత అగ్ర హీరోయిన్ స్థాయికి చేరుకున్నారు. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలో కనిపిస్తున్న బ్యూటీ కూడా అలాంటి ప్రయాణమే చేసిన నటి అని సమాచారం.ఆమె మరెవరో కాదు తమిళ నటి సాయి ధన్సిక. 2006లో సినీ రంగ ప్రవేశం చేసిన ఈ ముద్దుగుమ్మ ప్రారంభంలో తమిళ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలతోనే కెరీర్‌ను కొనసాగించింది. అయితే ఆరంభంలో పెద్దగా గుర్తింపు రాలేదు. అయినప్పటికీ 2016లో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన 'కబాలి' చిత్రంలో ఆయన కుమార్తె పాత్రలో నటించి మంచి గుర్తింపు సంపాదించింది. ఆ సినిమా ఆమె కెరీర్‌కు పెద్ద మలుపుగా మారి ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. దాదాపు పది సంవత్సరాల కష్టపడి చేసిన ప్రయాణం తర్వాత వచ్చిన ఈ విజయం సాయి ధన్సిక కెరీర్‌ను కొత్త దిశలోకి తీసుకెళ్లిందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆమె పలు చిత్రాల్లో నటిస్తూ బిజీగా కొనసాగుతోంది.



# బాలకృష్ణ- కొరటాల కాంబో

## 25న షూటింగ్ ప్రారంభానికి ముహూర్తం

బాలకృష్ణ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'ఎన్‌బికె 112'గా ప్రచారంలో ఉంది. ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. తాజాగా ఆ వివరాలను చిత్రబృందం పంచుకుంది. జూన్ 25న వెంకటపాలెంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరగనుంది. ముఖ్య అతిథులుగా మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్ హాజరు కానున్నారు. మే నెలలో ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. 'అధికారానికి ఉద్దేశం తోడైతే.. అది ఉద్యమంగా మారుతుంది' అనే పవర్‌ఫుల్ కొటేషన్‌తో టీమ్ దీనిపై అంచనాలు పెంచేసింది. కొరటాల శివ మార్కు సామాజిక సందేశంతో పక్కా మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాలయ్య.. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ – గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. కాజల్ కథానాయికగా నటిస్తుండగా.. మంచు మనోజ్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. ఈ రెండు సినిమాలను బాలకృష్ణ ఒకేసారి పూర్తి చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి.



Printed, Published and Owned by CB Mohan Rao, Printed at Spandana Printers, 2-165, Peruru, Tirupati, Andhra Pradesh, and Published from 20-3-122/C, Onti Maddimanu Street, Tirupati Andhra Pradesh, Editor, C.B. Mohan Rao, PRGI No. APTEL/25/A3753, Ph: 98660 71887 Email. andhramanam2025@gmail.com